## నేటి కందం- నేటికి అందం

మర పడవలు చెడిపోవగ
పరదేశీయులకు చిక్కి బందీలగుచున్
చెరలందున మ్రగ్గెడి-జా
లరులకు కలిగెను విముక్తి ప్రభుత చొరవతోన్ !!

(మర పడవలు చెడిపోవడం వలన పరదేశీయులకు చిక్కి వాళ్ళ జైళ్ళల్లో మ్రగ్గుతున్న 23 మంది భారత జాలర్లకు ప్రభుత్వ చొరవతో విముక్తి పొంది మరలా మన దేశానికి తిరిగి వచ్చారు.)

-రాధశ్రీ
సెల్:9494481210



# నేటి నిజం
తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

**చురక**

మంచోడైనా చెడ్డోడైనా
మనిషి గుణం వద్దంటా
గుర్తు చూసి ఓటేసుడే
కారుకెంతో ముద్దంటా.
గులాబీ దళపతుల
గాడితప్పే చెడు బాట
ఎన్నికల విలువదీసే
ఎందుకీ పాడు పాట

-వేల్పుల నారాయణ
9440433475



హైదరాబాద్ బుధవారం 4-2-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:146 పేజీలు:6 వెల: రూ.1/-


## మేడారం జాతర విజయవంతం: సీతక్క



హైదరాబాద్, ఫిబ్రవరి 3:ములుగు జిల్లాలో ఇటీవల నిర్వహించిన మేడారం జాతర విజయవంతమైందని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. మంగళవారం సెక్రటేరియట్‌లో విలేకర్లతో మంత్రి సీతక్క ఇష్టాగోష్టిగా మాట్లాడారు. జాతర పనులు, గుడి పనులు సజావుగా జరిగాయని సంతోషం వ్యక్తం చేశారు. కొంత మంది జాతరతోపాటు ఏర్పాట్లపై విష ప్రచారం చేశారంటూ మండిపడ్డారు. ఎక్కడా.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాతర ముగిసిందని పేర్కొన్నారు. ఒక దొంగతనం ఘటనపై కొందరు తప్పుడు ప్రచారం చేశారని వివరించారు. ఒకట్రెండు రోజుల్లో 'తిరుగు జాతర' జరుగుతుందని తెలిపారు.

ప్రతిపక్ష పార్టీల నాయకులు సైతం ఈ జాతర ఏర్పాట్లు బాగున్నాయని ప్రశంసించారని మంత్రి సీతక్క వివరించారు. క్లాస్, మాస్‌తోపాటు ఉన్నత స్థాయి వర్గాల వారు సైతం ఈ జాతరకు భారీగా తరలివచ్చారని చెప్పారు. సుమారు రెండున్నర కోట్ల మంది భక్తులు ఈ మేడారం జాతరకు వచ్చినట్లు భావిస్తున్నామన్నారు. వచ్చే జాతర సమయానికి మేడారం పరిసర ప్రాంతాల్లోని రహదారులను వెడల్పు చేసి.. ట్రాఫిక్ జామ్‌లను నివారిస్తామని పేర్కొన్నారు. వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాల కోసం ములుగు జిల్లా పరిధిలో పనులపై అధికారులతో సమీక్షిస్తామని ఈ సందర్భంగా మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

## బడ్జెట్ లో తెలంగాణకు కేంద్రం ప్రాధాన్యం: కిషన్ రెడ్డి

హైదరాబాద్ ఫిబ్రవరి 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: తెలంగాణ అభివృద్ధికి కేంద్రం అన్ని రకాలుగా సహకరిస్తోందని బిజెపి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. తెలంగాణకు బడ్జెట్ లో కేంద్రం ప్రాధాన్యం ఇచ్చిందని అన్నారు. ఈ సందర్భంగా బిజెపి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జి రామ్ జి పథకంపై కాంగ్రెస్.. ఉచితాల కోసమే బడ్జెట్ అన్నట్లుగా ప్రజల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. రూ.96 వేల కోట్లు జి రామ్ జి పథకానికి నిధులు పెంచారని, ఎరువులపైనా కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేసిందని ధ్వజమెత్తారు. ఎన్నికల బడ్జెట్ కాదు.. వికసిత్ భారత్ లక్ష్యంగా పెట్టిన బడ్జెట్ అని.. తెలంగాణ ఒక హబ్ గా తయారవుతుందని, ఫార్మా, ఐటీ, హెల్త్ ఇలా హబ్ లకు హైదరాబాద్ కేంద్రం అని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రాల వారీగా కాకుండా దేశ అభివృద్ధికి సంబంధించిన బడ్జెట్ గా చూడాలని సూచించారు. ప్రధాని నరేంద్ర మోడీ ఆవాస్ కింద రాష్ట్రానికి 4.30 లక్షల ఇళ్లు కేటాయించారని, జాతీయ రహదారుల నిర్మాణంలో తెలంగాణకు పెద్దపీట వేశారని ప్రశంసించారు.

## ముగిసిన మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల పరిశీలన

హైదరాబాద్, ఫిబ్రవరి 3:మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల పరిశీలన శనివారం ముగిసింది. ఉపసంహరణకు మంగళవారం వరకు గడువు ఉన్న నేపథ్యంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ప్రధాన పార్టీల అభ్యర్థుల ఎంపిక, బీఫామ్‌ల కేటాయింపు ప్రక్రియ ఉత్కంఠ రేపుతోంది. మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలలోపు పార్టీల తరుపున పోటీ చేస్తున్న అభ్యర్థులు బీఫామ్ అప్పగించాల్సి ఉంటుంది. అదే సమయానికి నామినేషన్‌ను ఉపసంహరించుకోవచ్చు.

వ్యూహాత్మకంగా అడుగులు...

పార్టీ ప్రకటించిన అభ్యర్థులు మాత్రమే బరిలో ఉండేలా అసంతృప్తులను కాంగ్రెస్ నేతలు బుజ్జగిస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసేలోగా రెబల్స్‌ను దారికి తీసుకొచ్చేలా ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఎవరైతే పార్టీ నిర్ణయానికి కట్టుబడి నామినేషన్ వెనక్కి తీసుకుంటారో వారికి భవిష్యత్తులో ప్రాధాన్యం ఉంటుందని హామీ ఇస్తున్నారు. ఇక పార్టీ నుంచి బీఫామ్ వస్తుందని సంకేతాలు ఉన్న అభ్యర్థులు క్షేత్రస్థాయిలో ప్రచారం చేస్తూనే, మరో పక్క అసమ్మతివాదులను కలుపునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.

ప్రధాన పార్టీలకు సవాల్..

హుజూరాబాద్ మున్సిపాలిటీలో టికెట్ల కోసం తీవ్ర పోటీ నెలకొనడం ప్రధాన పార్టీలకు సవాల్‌గా మారింది. ప్రధాన పార్టీల నుంచి కౌన్సిలర్లుగా పోటీ చేసేందుకు పలువురు ఆసక్తి చూపిస్తున్నారు. హుజూరాబాద్ మున్సిపాలిటీలో 30 వార్డులు ఉండగా 189 మంది అభ్యర్థులు 304 నామినేషన్లు దాఖలు చేశారు. కాంగ్రెస్ పార్టీ నుంచి 89, బీఆర్ఎస్ 77, బీజేపీ 79, బీఎస్పీ 4, ఇతర పార్టీలు 16, ఇండిపెండెంట్ 39 నామినేషన్లు దాఖలయ్యాయి. ప్రధాన పార్టీ నేతలు ఒక్కొక్కరికి బీఫామ్ ఇవ్వనుండగా మిగతా వారిని బుజ్జగించడంపై నేతలు దృష్టి సారించారు. సోమవారం ఎవరు నామినేషన్లు ఉపసంహరించుకోలేదు.

## చమురు కొనుగోళ్లు నిలిపివేస్తామని భారత్ చెప్పలేదు.. రష్యా స్పందన




న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3:అమెరికాతో వాణిజ్య ఒప్పందంలో భాగంగా రష్యా నుంచి చమురు దిగుమతులను నిలిపివేయడానికి భారత్ అంగీకరించిందంటూ డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనపై క్రెమ్లిన్ స్పందించింది. న్యూఢిల్లీ నుంచి ఇంతవరకూ అలాంటి సంకేతాలేవీ తమకు రాలేదని పేర్కొంది.

వాషింగ్టన్-న్యూఢిల్లీ మధ్య ట్రేడ్ ఒప్పందం కుదిరిందంటూ ట్రంప్ తన 'ట్రూత్'లో పోస్ట్ చేశారు. రష్యన్ చమురు కొనుగోళ్లను ఆపడానికి, అమెరికా, వెనెజువెలా నుంచి కొనుగోలు చేయడానికి భారత్ అంగీకరించినట్లు ట్రంప్ ప్రకటించారు. దీనిపై మోదీ వెంటనే స్పందించారు. భారత ఉత్పత్తులపై ఇక నుంచి 18 శాతమే అమెరికా సుంకాలు అమలవుతాయని, ఇది సంతోషకరమని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పేర్కొన్నారు. అయితే రష్యా నుంచి చమురు కొనుగోళ్లను నిలిపివేసే విషయంపై ఎలాంటి అధికారిక ప్రకటనా చేయలేదు.

**ఇండియాతో విలువైన సంబంధాలు: రష్యా**

రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారత్ నిలిపివేయనుందంటూ ట్రంప్ చేసిన ప్రకటనపై క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ మాట్లాడారు. ఈ విషయంలో న్యూఢిల్లీ నుంచి ఎలాంటి ప్రకటన రాలేదని చెప్పారు. భారత్‌తో తమకు విలువైన సంబంధాలు ఉన్నాయని, ఇరుదేశాల మధ్య ఉన్న వ్యూహాత్మక భాగ్యస్వామ్యం కొనసాగుతుందని చెప్పారు. 'అమెరికా-భారత్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మేము గౌరవిస్తున్నాం. అయితే రష్యా-ఇండియా మధ్య కీలక రంగాల్లో అత్యంత లోతైన, విస్తృతమైన సహకారం కూడా ఏమాత్రం తక్కువ కాదు. ఇది మాకు అత్యంత ముఖ్యం కూడా. ఢిల్లీతో మా ద్వైపాక్షిక సంబంధాలను మరింత విస్తృత పరుచుకోవాలన్నదే మా అభిమతం' అని చెప్పారు. ఉక్రెయిన్ యుద్ధ 2022లో ప్రారంభమైన తర్వాత రష్యా నుంచి డిస్కౌంట్‌తో ముడిచమురును కొనుగోలు చేస్తున్న దేశాల్లో భారత్ కీలకంగా ఉంది. ఇది పశ్చిమ దేశాలకు కన్నెర్ర అవుతోంది.

## భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న పవన్ సతీమణి




వరంగల్, ఫిబ్రవరి 03: ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సతీమణి అన్నా లెజినోవా.. వరంగల్ భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. మంగళవారం నాడు ఆలయానికి విచ్చేసిన అన్నా లెజినోవాకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. దేవాలయంలో తొలుత ఆదిశంకరాచార్యులు, వల్లభ గణపతిని ఆమె దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత ఆలయంలోని మండపంలో అన్నా లెజినోవాకు అర్చకులు, వేదపండితులు ఆశీర్వచనం పలికి.. అమ్మవారి తీర్ధ ప్రసాదాలను అందజేశారు. దేవాలయానికి సంబంధించిన విశేషాలను అర్చకులను అడిగి ఆమె తెలుసుకున్నారు

## బీఫామ్ ఇవ్వలేదని రోడ్డెక్కి కాంగ్రెస్ మహిళా నేత ఆందోళన

మెదక్, ఫిబ్రవరి 3: కాంగ్రెస్ పార్టీ తనకు బీ ఫామ్ ఇవ్వలేదని ఓ మహిళా కాంగ్రెస్ నాయకురాలు రోడ్డెక్కింది. తనకు కాంగ్రెస్ పార్టీ భీ ఫాం ఇవ్వకపోవడంతో ఆందోళన చేపట్టింది. ఈ ఘటన మున్సిపల్ కేంద్రమైన జిన్నారంలో చోటుచేసుకుంది.

జిన్నారం మున్సిపాలిటీలోని నాలుగో వార్డుకు చెందిన కాంగ్రెస్ మహిళ నేత నీలం లత గత కొన్నేళ్లుగా కాంగ్రెస్ పార్టీలో మహిళా నేతగా కొనసాగుతున్నారు. అయితే ఇటీవలే కేటాయించిన మున్సిపల్ ఎన్నికల రిజర్వేషన్ల జాబితాలో నాలుగో వార్డ్ జనరల్ మహిళకు కేటాయించడంతో తనకు బీఫారం లభిస్తుందని నీలం లత ఆశించింది.

కానీ కాంగ్రెస్ అధిష్టానం అనూహ్యంగా నీలం లతకు కాకుండా పుట్టి విజయలక్ష్మికి బీఫామ్ కేటాయించింది. దీంతో నీలం లత ఆగ్రహం వ్యక్తం చేస్తూ జిన్నారంలో నామినేషన్ దాఖలు చేస్తున్న కేంద్రం వద్ద ఆందోళనకు దిగింది.

ఈ సందర్భంగా నీలం లత మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో మహిళలకు చోటు దక్కకపోవడం సరైనది కాదన్నారు. జిన్నారంకు చెందిన కాంగ్రెస్ ముఖ్య నేతలు వడ్డే కృష్ణ, శ్రీకాంత్ రెడ్డిలు తనకు టికెట్ రాకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పరాభవం తప్పదన్నారు.

## జగిత్యాలలో జగడం.. తీవ్రంగా స్పందించిన మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి



జగిత్యాల, ఫిబ్రవరి 03: మున్సిపల్ ఎన్నికల టికెట్ల పంపిణీలో స్థానిక ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వైపే అధిష్ఠానం మొగ్గు చూపడంతో.. మాజీ ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి నివాసం వద్ద మంగళవారం నాడు పార్టీ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. బీఆర్ఎస్ నుంచి వచ్చిన వారికే టికెట్లు కేటాయిస్తున్నారంటూ జీవన్ రెడ్డి వద్ద వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో పార్టీ అధిష్ఠానం తీరుపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. టికెట్ల విషయంలో తన గొంతు కోశారంటూ అనుచరుల ఎదుట జీవన్ రెడ్డి కలత చెందినట్లు తెలుస్తోంది.

రాజీ లేదు.. రాజీనామానే అంటూ కార్యకర్తలకు జీవన్ రెడ్డి స్పష్టం చేసినట్లు సమాచారం. దాంతో ఎమ్మెల్యే సంజయ్ నివాసాన్ని ముట్టడిస్తామని ఆయన అనుచరులు, కార్యకర్తలు ఈ సందర్భంగా హెచ్చరించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఎమ్మెల్యే సంజయ్ నివాసం వద్ద భారీగా పోలీసులు మోహరించారు. జగిత్యాలలోని మొత్తం 50 వార్డుల్లో సంజయ్ వర్గానికి 29, జీవన్ రెడ్డి వర్గానికి 21 టికెట్లు కేటాయించారు. ఏడాదిన్నరగా ఎమ్మెల్యే సంజయ్, జీవన్ రెడ్డిల మధ్య మాటల యుద్ధం కొనసాగుతున్న సంగతి తెలిసిందే.

సంజయ్ వ్యవహార శైలిపై జీవన్ రెడ్డి కాస్త గుర్రుగా ఉంటున్నారు. ఇప్పటివరకూ జీవన్ రెడ్డిని శాంతింప చేసేందుకు అధిష్ఠానం ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. కనీసం ఆయనకు అధిష్ఠానం పెద్దలు ఫోన్ సైతం చేయకపోవడం గమనార్హం. దాంతో జీవన్‌రెడ్డిని హైకమాండ్ లైట్ తీసుకుందంటూ ఒక ప్రచారం పార్టీలో జోరుగా నడుస్తోంది.

2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జగిత్యాల నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా సంజయ్ బరిలో దిగి.. కాంగ్రెస్ అభ్యర్థి జీవన్ రెడ్డిపై ఘన విజయం సాధించారు. అనంతరం సంజయ్.. కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకునేందుకు సిద్ధమయ్యారు. అయితే కాంగ్రెస్ పార్టీలోకి సంజయ్ రాకను జీవన్ రెడ్డి తీవ్రంగా వ్యతిరేకించారు. పార్టీ పెద్దలు వెంటనే రంగంలోకి దిగి.. జీవన్ రెడ్డిని శాంతింప చేశారు. దాంతో కాంగ్రెస్ పార్టీలో సంజయ్ చేరారు. నాటి నుంచి జగిత్యాల కాంగ్రెస్ పార్టీలో రెండు వర్గాలు తయారయ్యాయి. వాటిలో ఒకటి జీవన్ రెడ్డి వర్గం కాగా.. మరొకటి సంజయ్ వర్గం. ఈ వర్గాల మధ్య పోరు ఇటీవల మరింత తీవ్రమైంది. ఒక వర్గంపై మరో వర్గం ఆధిక్యాన్ని ప్రదర్శించేందుకు అందివచ్చిన ప్రతి అవకాశాన్నీ ఉపయోగించుకొంటుంది. దీంతో జగిత్యాలలో ఇరువర్గాల మధ్య జగడం నిత్యకృత్యంగా మారింది. అలాంటి వేళ పార్టీ వీడేందుకు సీనియర్ నేత టి.జీవన్ రెడ్డి సన్నాహకాలు చేసుకుంటున్నారనే

## మణిపూర్ నూతన సీఎంగా యుమ్నం ఖేమ్‌చంద్ సింగ్..!



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3:స్థానిక తెగల మధ్య ఆధిపత్య పోరుతో సతమతమవుతున్న ఈశాన్య రాష్ట్రం మణిపూర్ లో కొత్త ప్రభుత్వం ఏర్పడనుంది. ఏడాది కాలంగా ఖాళీగా ఉన్న ముఖ్యమంత్రి పదవికి యుమ్నమ్ ఖేమ్‌చంద్ సింగ్ ఎంపికయ్యారు. బీజేపీ నాయకుడైన ఆయన బీరెన్ సింగ్ వారసుడిగా.. ఆ రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా త్వరలోనే ప్రమాణ స్వీకారం చేయనున్నారు. త్వరలోనే మణిపూర్‌లో కొత్త ప్రభుత్వం కొలువుదీరనుంది. మణిపూర్‌లోని ప్రధానమైన మీటీస్, కుకిస్ తెగల మధ్య నిరుడు విభేదాలు తారాస్థాయికి చేరడంతో ముఖ్యమంత్రిగా నేను ఉండలేనంటూ నిరుడు ఫిబ్రవరి 9న బీరెన్ సింగ్ రాజీనామా చేశారు. అప్పటి నుంచి ముఖ్యమంత్రి పోస్ట్ ఖాళీగా ఉంది. ఆయన వారసుడిగా బాధ్యతలు చేపట్టేది ఎవరు అనే చర్చ జోరుగా సాగింది.

## తిరుమల పవిత్రతను కాపాడి తీరుతాం.. ఎన్డీయే నేతలతో సీఎం చంద్రబాబు

తిరుపతి, ఫిబ్రవరి 3:తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదం కల్తీ వివాదంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తన కార్యాచరణను ముమ్మరం చేసింది. కేబినెట్ సమావేశానికి ముందు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన నివాసం లో ఎన్డీయే భాగస్వామ్య పక్షాల నేతలతో కీలక భేటీ నిర్వహించారు. శ్రీవారి ప్రసాదం పవిత్రత ను దెబ్బ తీసిన వారిని వదిలే ప్రసక్తే లేదని ఈ సందర్భంగా సీఎం స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, 'తిరుమల కల్తీ లడ్డూ విషయంలో ప్రభుత్వం ఎటువంటి రాజకీయ కోణం చూడటం లేదు. ఇది కేవలం రాజకీయ విమర్శలకు పరిమితం కావాల్సిన అంశం కాదు. కోట్లాది మంది భక్తుల మనోభావాలు, శ్రీవారి పవిత్రతకు సంబంధించిన అంశం. ఆ పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత మనపై ఉంది' అని సహచర నేతలకు వివరించారు. ఈ కుట్ర వెనుక ఉన్న నిందితులను నిగ్గుతేల్చేందుకే విచారణ కమిటీని ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు.


## బడ్జెట్ సమావేశాలు.. 8మంది ఎంపీల సస్పెన్షన్..

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3:లోకసభలో తాజా బడ్జెట్ సమావేశాల సందర్భంగా 8మంది ప్రతిపక్ష పార్టీల ఎంపీలపై సస్పెన్షన్ వేటు పడింది. స్పీకర్ ఓం బిర్లాపై వైపుగా కాగితాలను విసిరినందుకు వారిపై సస్పెన్షన్ వేటు పడింది. కాంగ్రెస్‌కు చెందిన ఎంపీలు మాణిక్కం ఠాగూర్ (తమిళనాడు ఎంపీ), గుర్జీత్ సింగ్ ఔజ్లా (పంజాబ్), అమరీందర్ సింగ్ రాజా(పంజాబ్), కిరణ్ కుమార్ రెడ్డి (తెలంగాణ), హిబీ ఈడెన్ (కేరళ), డీన్ కురియకోస్ (కేరళ), ప్రశాంత్ వడోలే (మహారాష్ట్ర)తోపాటు సీపీఎమ్‌కు చెందిన ఎస్.వెంకటేశన్ (తమిళనాడు)ను మిగిలిన బడ్జెట్ సమావేశాలకు హాజరు కాకూడదంటూ లోక్‌సభ స్పీకర్ సస్పెండ్ చేశారు.

స్పీకర్ ఓం బిర్లాపై కాగితాలు విసిరిన ఎంపీలపై చర్యలు కోరుతూ కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ ఆమోదించడంతో సస్పెన్షన్ వేటు పడింది భారత్-చైనా ఉద్రిక్తతలకు సంబంధించి ఆర్మీ మాజీ చీఫ్ నరవణె అముద్రిత పుస్తకంలోని అంశాలపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చర్చకు పట్టుబట్టిన నేపథ్యంలో ఎంపీలు నిరసనలకు దిగి సస్పెన్షన్‌కు గురయ్యారు.

## చిట్యాల నేషనల్ హైవేపై కత్తిపోటు కలకలం

చిట్యాల, ఫిబ్రవరి 03 : చిట్యాల నేషనల్ హైవేపై కత్తిపోటు కలకలం రేపింది. నల్లగొండ నుండి హైదరాబాద్‌కు వెళ్తున్న కారును ఓ వ్యక్తి నార్కెట్‌పల్లి వద్ద లిఫ్ట్ అడిగాడు. డ్రైవర్ ఇమ్రాన్ కారు ఆపి అతడిని ఎక్కించుకున్నాడు. కొంత దూరం వెళ్లాక లిఫ్ట్ అడిగి కారులో ఎక్కిన వ్యక్తి అకస్మాత్తుగా ఇమ్రాన్‌పై కత్తితో దాడికి పాల్పడ్డాడు. మొబైక్ లాక్కునే ప్రయత్నం చేశాడు. అప్రమత్తమైన ఇమ్రాన్ ప్రతిఘటించడంతో సదరు వ్యక్తి అక్కడినుండి పారిపోయాడు. కత్తివేటుతో తీవ్రంగా గాయపడ్డ డ్రైవర్‌ను స్థానికుల సమాచారంతో 108 వాహనంలో నల్లగొండ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసిన చిట్యాల పోలీసులు దుండగుడి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

# రాజకీయ, సామాజిక అస్థిరతల మధ్య శ్రీలంక స్వాతంత్ర్య దినోత్సవం!

## (04 ఫిబ్రవరి "శ్రీలంక స్వాతంత్ర్య దినోత్సవం" సందర్భంగా)

హిందూ మహాసముద్రం, బంగాళాఖాతం సముద్రాల సరిహద్దులతో ఏర్పడిన ద్వీప దేశంగా భారత దేశ తీరానికి 50 కిమీ దూరంలో ఉన్న శ్రీలంక 04 ఫిబ్రవరిన స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి భారీ ఏర్పాట్లలో మునిగి ఉన్నది. 1972 వరకు ఈ ద్వీపాన్ని 'సిలోన్'గా పిలవడం జరిగేది. 1948లో పాక్షిక స్వాతంత్ర్యం పొంది, 22 మే 1972లో పూర్తి స్వతంత్రం పొందిన తర్వాత 1978, 04 ఫిబ్రవరి రోజున బ్రిటీష్ వలస పాలన నుంచి స్వాతంత్ర్యం పొంది అధికారికంగా "ప్రజాస్వామ్య సామ్యవాద గణతంత్ర శ్రీలంక"గా రూపాంతరం చెంది ప్రెసిడెన్షియల్-పార్లమెంటరీ మిశ్రమ వ్యవస్థగా తనదైన రాజ్యాంగంతో అనేక ఒడుదుడుకులు మధ్య నేడు 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని 04 ఫిబ్రవరి 2026న నిర్వహించుకుంటున్నది. పశ్చిమ ఈశాన్య భారత బెంగాల్, ఒడిసాలో నుంచి వలస వచ్చిన ఆధునిక ఇండో-ఆర్యన్ సెటిలర్స్‌ను "సింహలీస్" అని పిలవడం జరుగుతున్నది.

### శ్రీలంక వైవిధ్యభరిత జనాభా:

ప్రస్తుతం 23.5 మిలియన్ల శ్రీలంక జనాభాలో 75 శాతం సింహలీస్, 11 శాతం శ్రీలంక తమిళులు, 9 శాతం వరకు ముస్లిమ్ మూర్‌లు 4 శాతం భారత తమిళుల జనాభా ఉన్నది. అత్యధిక సింహలీలు బుద్ధిస్టులుగా, తమిళులు హిందువులుగా రెండు గ్రూపుల మధ్య విభేదాలతో రెండున్నర దశాబ్దాల పాటు ఎల్‌టిటిఈ, అధిక జనాభా ఉన్న సింహలీస్ (ప్రభుత్వ సహకారంతో) మధ్య వర్గ పోరు (1976-2002) కూడా జరగడం, అనేక హింసాత్మక ఘటనలు చేటు చేసుకోవడం, చివరికి ఎల్‌టిటిఈ పోరాటాలను అడ్డుకోవడం, అంతం చేయడం చూసాం. శ్రీలంక ప్రభుత్వాలు, ఆర్థిక సంక్షోభాల నడుమ కొనసాగుతున్న శ్రీలంక ప్రయాణంలో ఆహార, ఇంధన, ఔషధాల కొరతలు కూడా తోడుకావడంతో పలు ప్రజా ఉద్యమాగ్నులు ఎగిసి పడడం చూసాం.

### చరిత్ర పుటల్లో శ్రీలంక - సిలోన్:

శ్రీలంక సంస్కృతి, నాగరికతను పరిశీలిస్తే దానిపై బుద్ధిస్టుల, హిందువుల, వలస పాలకుల, జాతి వైవిధ్య, ఆధునిక ప్రపంచీకరణ ప్రభావాలు ప్రస్ఫుటంగా కనుపిస్తాయి. శ్రీలంకలో సామాజికపరంగా కులమత వ్యవస్థలు భారతదేశంలో ఉన్నట్లుగానే కనిపిస్తాయి. 16వ శతాబ్దంలో శ్రీలంక తీరప్రాంతాలు పోర్చుగీస్ అధీనంలో, 17వ శతాబ్దంలో డచ్‌ల అధీనంలో పాలన కొనసాగింది. 1796 నుంచి ఈ ద్వీప ప్రాంతం బ్రిటీష్ అధీనంలోకి క్రమంగా మారడం, 1833లో పూర్తిగా బ్రిటీష్ పాలన పగ్గాలు పట్టి ఈ ద్వీపానికి 'సిలోన్'గా నామకరణం చేసి వలక పాలన కొనసాగించడం, వలస పాలన 1948 వరకు కొనసాగడం చూసాం. సిలోన్ ప్రాంతం 1972లో శ్రీలంక రిపబ్లిక్‌గా పేరు మారడం, 04 ఫిబ్రవరి 1948న పూర్ణ స్వతంత్ర పొందిన తనదైన రాజ్యాంగం ప్రకారం "ప్రజాస్వామ్య సామ్యవాద గణతంత్ర శ్రీలంక"గా రూపాంతరం చెందడం జరిగింది. శ్రీలంక రాజధానిగా 'శ్రీ జయవర్ధనేపుర కొట్టె (కొలంబో)' పాలన కేంద్రంగా పని చేస్తున్నది. శ్రీలంక అధ్యక్షుడిని ఎన్నిక ద్వారా ఎంచుకోవడంతో పాటు 225 మంది కలిగిన లెజిస్లేటివ్ పార్లమెంట్ ద్వారా ప్రధాన మంత్రిని ఎన్నుకోవడం జరుగుతుంది. ప్రస్తుతం అధ్యక్షుడిగా 'అరుణ కుమార దిసనాయకె', ప్రధానిగా 'హరిణి అమరసూర్య'లు సేవలు అందిస్తున్నారు. గతంలో దీర్ఘకాలం పాటు శ్రీలంకకు పెద్దన్న వలె నిలిచింది మన భారత్. ప్రస్తుత డిజిటల్ యుగంలో మారుతున్న సమీకరణాల ఆధారంగా ఆర్థిక చేయూత బూచీ చూపుతూ చైనా నాయకత్వం శ్రీలంకను మచ్చిక చేసుకోవడం చూస్తున్నాం.

04 ఫిబ్రవరి 2026న శ్రీలంక జరుపుకుంటున్న 78వ స్వాతంత్ర్య దినోత్సవం-2026 ఇతివృత్తంగా "శ్రీలంకను నిర్మించుకుందాం (లెటజ్ బిల్డ్ శ్రీలంక)" అనే అంశాన్ని తీసుకొని ఘనంగా నిర్వహించుకోవడానికి భారీ ఏర్పాట్లు చేశారు. ఈ వేడుకల్లో రాజధాని కేంద్రంగా జాతీయ పతాకాన్ని ఎగరేయడం, ఆకర్షణీయ రక్షణ దళాల కవాతులు, సంస్కృతి సంప్రదాయాల ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, దేశ ఘన కీర్తిని చాటే ప్రదర్శనలు లాంటివని అనేకం నిర్వహిస్తారు. అనేక సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్న శ్రీలంక రానున్న రోజుల్లో శాంతియుతంగా ప్రగతి పథాన స్థిరంగా అడుగులు వేయాలని కోరుకుందాం, మన పొరుగు దేశవాసులకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేద్దాం.

-డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# వాతావరణ పర్యవేక్షణకు ఆటోమేటిక్ వాతావరణ కేంద్రాలు

## -జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి



కర్నూలు, ఫిబ్రవరి 3: ఖచ్చితమైన, రియల్ టైమ్ వాతావరణ పర్యవేక్షణ కోసం ఆటోమేటిక్ వాతావరణ కేంద్రాలు నిరంతర డేటాను అందిస్తాయని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి తెలిపారు. మంగళవారం ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామంలోని ఏపీ ట్రాన్స్ కో కార్యాలయ ఆవరణంలో ఏర్పాటు చేసిన ఆటోమేటిక్ వాతావరణ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం ఆటోమేటిక్ వాతావరణ కేంద్రాలు ఆర్టీజిఎస్ కు అనుసంధానం అయ్యాయన్నారు.

ఈ కేంద్రం ద్వారా వర్షపాతం, నేలలో తేమ, వాతావరణ పీడనం, గాలి, ఉష్ణోగ్రత వంటి వివరాలు ఆటోమేటిక్ గా ఆన్లైన్ లో నమోదు అవుతాయని తెలిపారు. తుఫాను లాంటి ప్రకృతి వైపరీత్యాల సమయంలో ముందస్తు హెచ్చరికలు జారీ చేయడానికి, వ్యవసాయ ప్రణాళికలు రూపొందించడానికి సంబంధిత వాతావరణ కేంద్రం కీలక పాత్ర పోషిస్తుందన్నారు.

ఈ కేంద్రానికి సంబంధించిన యంత్రాల నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని, ఏవైనా సాంకేతిక సమస్యలు తలెత్తితే తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సీపీఓ భారతి, డివైఎన్ఓ భాస్కర్, రామాంజనేయులు, ఏ ఎస్ ఓ సరళ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

# భారత ఉత్పత్తులపై సుంకాలను 18 శాతానికి తగ్గించిన అధ్యక్షుడు ట్రంప్‌నకు కృతజ్ఞతలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2:అధ్యక్షుడు ట్రంప్‌తో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు మాట్లాడారు. భారత ఉత్పత్తులపై సుంకాలను 18 శాతానికి తగ్గిస్తున్నట్టు ప్రకటించిన అధ్యక్షుడు ట్రంప్‌నకు 1.4 బిలియన్ల మంది భారతీయుల తరఫున ధన్యవాదాలు తెలియజేశారు.

రెండు అతి ప్రధాన ఆర్థిక వ్యవస్థలు, ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థలు కలసి పని చేసినప్పుడు.. అది మన ప్రజలకు ప్రయోజనం చేకూరుస్తుందని, ఉభయ పక్షాలకు లబ్ధినందించే సహకారానికి అపారమైన అవకాశాలను ఇస్తుందని శ్రీ మోదీ తెలిపారు.

"ప్రపంచ శాంతి, స్థిరత్వం, సంక్షేమానికి అధ్యక్షుడు ట్రంప్ నాయకత్వం కీలకమైనది. ఆయన చేస్తున్న శాంతి ప్రయత్నాలకు భారత్ సంపూర్ణ మద్దతు ఇస్తుంది" అని శ్రీ మోదీ పేర్కొన్నారు.

"నా మిత్రుడు, అధ్యక్షుడు ట్రంప్‌తో ఈ రోజు మాట్లాడటం చాలా ఆనందంగా ఉంది. భారత్‌లో తయారైన ఉత్పత్తులపై విధించే సుంకం ఇప్పుడు 18 శాతానికి తగ్గుతున్నందుకు సంతోషిస్తున్నాను. ఈ అద్భుతమైన ప్రకటన చేసిన అధ్యక్షుడు ట్రంప్‌నకు 1.4 బిలియన్ల మంది భారతీయుల తరఫున కృతజ్ఞతలు.రెండు ప్రధాన ఆర్థిక వ్యవస్థలు, ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశాలు కలసి పని చేసినప్పుడు అది మన ప్రజలకు ప్రయోజనం చేకూరుస్తుంది. ఉభయ పక్షాలకు లబ్ధిని అందించే సహకారానికి అపారమైన అవకాశాలను ఇస్తుంది.

అంతర్జాతీయ శాంతి, స్థిరత్వం, సంక్షేమానికి అధ్యక్షుడు ట్రంప్ నాయకత్వం కీలకం. ఆయన చేస్తున్న శాంతి ప్రయత్నా లకు భారత్ సంపూర్ణ మద్దతును అందిస్తుంది. మన భాగస్వామ్యాన్ని నూతన శిఖరాలకు చేర్చేలా.. వారితో కలసి పని చేసేందుకు ఎదురు చూస్తున్నాను."

# రూ.100 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు

## -జీఎస్టీ నమోదులో ఆలస్యం వద్దు

## -జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు, ఫిబ్రవరి 3: జిల్లాలో సుమారు రూ.100 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ వెల్లడించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన జీఎస్టీ అమలు సమీక్ష సమావేశంలో ఆయన సంబంధిత శాఖల అధికారులతో విస్తృతంగా చర్చించారు. అభివృద్ధి పనులు వేగంగా, పారదర్శకంగా పూర్తి కావాలంటే పన్ను విధానాల అమలు కచ్చితంగా ఉండాలని, శాఖల మధ్య సమన్వయం మరింత బలోపేతం కావాలని ఆయన స్పష్టం చేశారు.

పీఎం అజయ్ పథకం కింద గృహ నిర్మాణ శాఖ ద్వారా జరుగుతున్న అన్ని పనులను తప్పనిసరిగా వెబ్ పోర్టల్‌లో నమోదు చేయాలని, వాటికి సంబంధించిన జీఎస్టీ నమోదు ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం ఉండకూడదని కలెక్టర్ ఆదేశించారు. జీఎస్టీ చెల్లింపులకు సంబంధించి దరఖాస్తులు సమర్పించినప్పటికీ అనవసర జాప్యం జరుగుతోందని, దీని వల్ల చెల్లింపుల ప్రక్రియతో పాటు డేటా సమగ్రత కూడా ప్రభావితమవుతోందని ఆయన పేర్కొన్నారు. చిన్న మొత్తాల పనులైనా సరే శాఖల మధ్య పరస్పర అవగాహనతో సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సూచించారు.

ప్రతి నెల మొదటి వారం లోపు జీఎస్టీ చెల్లింపులు పూర్తిచేయడం బాధ్యతగా తీసుకోవాలని, అలాగే ప్రతి నెల జీఎస్టీ అధికారులు వసూలు చేస్తున్న రెవెన్యూ వివరాలను సమగ్ర జాబితా రూపంలో సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. నకిలీ పన్ను చెల్లింపుదారులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని జీఎస్టీ అధికారులకు స్పష్టం చేశారు.

కుప్పం నియోజకవర్గంలో సుమారు రూ.29 కోట్ల విలువైన అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. ఎస్సీ, ఎస్టీ కాలనీల అభివృద్ధి, పీఎం సూర్య ఘర్, పీఎం కుసుమ్ పథకాలు, హాస్టల్ భవనాల నిర్మాణాలు తదితర పనులు ఇందులో భాగంగా ఉన్నాయని వివరించారు. ఈ పనులన్నింటిలో పన్ను విధానాలు సక్రమంగా అమలవుతాయో లేదో పర్యవేక్షించాలని సూచించారు.

వాణిజ్య పన్నుల శాఖ ద్వారా



గుర్తించబడిన బకాయిలు ఉన్న పన్ను చెల్లింపుదారులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, అవసరమైతే వారి పన్ను లావాదేవీలను నిలిపివేసే చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. దీనికి సంబంధించి డిఆర్ఓ, రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు, సబ్-రిజిస్ట్రార్లతో కలిసి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ చర్యల ద్వారా రిజిస్ట్రేషన్ వ్యవహారాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు గణనీయంగా తగ్గుతాయని అభిప్రాయపడ్డారు.

ప్రభుత్వ పన్నులు సకాలంలో చెల్లించడం ప్రతి శాఖ బాధ్యతగా తీసుకోవాలని, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను మార్చి 31 లోపు సాధించేలా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. అభివృద్ధి పనులు, పన్ను వసూళ్లు, డేటా నిర్వహణ ఈ మూడు అంశాల్లో క్రమశిక్షణతో ముందుకు సాగితే జిల్లాకు ఆర్థిక బలం చేకూరుతుందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్ఓ మోహన్ కుమార్, జాయింట్ కమిషనర్ కమర్షియల్ టాక్స్ అధికారి రవీంద్రనాథ్ రెడ్డి, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ పరదేశి నాయుడు తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# కూడళ్ల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

## -నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్



కర్నూలు, ఫిబ్రవరి 3: నగరంలోని కూడళ్ల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ తెలిపారు. ట్రాఫిక్ రద్దీని తగ్గించి వాహన రాకపోకలు సులభతరం చేయడమే లక్ష్యంగా అవసరమైన ప్రాంతాల్లో కూడళ్ల ఏర్పాటు చేసి వాటిని ఆధునికంగా అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం ఆయన శివాజీ మహారాజ్ ఛత్రపతి (వై.జంక్షన్) కూడలిని పరిశీలించారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకుని కూడళ్ల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ కూడలిని రూ.54 లక్షల వ్యయంతో అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఎస్ఈ రమణ మూర్తి, డిసిపి వెంకటరమణ, డిఈఈ గిరిరాజ్, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాష, టిపిఈ ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

# ఉమెన్ సివిల్ రైట్స్ అనే పేరుతో మహిళల లైంగిక దోపిడి.. మహిళల అక్రమ రవాణ

## - పౌర హక్కుల ప్రజా సంఘం(పీయూసీఎల్) ఆధ్యక్షురాలు జయవింధ్యాల

హైదరాబాద్ ఫిబ్రవరి 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );హైదరాబాద్ ఉమెన్ సివిల్ రైట్స్ అనే స్వచ్ఛంద సంస్థ ను నడిపిస్తూ మహిళల లైంగిక, దోపిడి. మహిళల అక్రమ రవాణ లాంటి అనైతిక కార్యాక్రమాలు పాల్పడుతూన్న పాతబస్తి బాబానగర్కు చెందిన నిలోఫరో గంతో తమకు ప్రాణా హాని ఉందని భాధితులు పేర్కొ న్నారు. ఈ మేరకు సోమవారం హైదరాబాడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పౌర హక్కుల ప్రజా సంఘం (పీయూసీఎల్) ఆధ్యక్షురాలు జయవింధ్యాల భాధితులు మహ్మద్ అమిర్ షరీఫ్, అబ్దులు వాసీమ్, అఫ్రష్ ఉన్నీసా, మహ్మద్ ఇబ్రహీంలతో కలిసి ఆమె మాట్లాడారు. :

ఉమెన్ సివిల్ రైట్స్ పేరిట సంఘం నడుపుతూ యువతులకు ఆశ చూపిస్తూ అరబ్ దేశాలతో పాటు ముంబాయ్, పూణే నగరాలకు తరలించి వ్యభాచార రాకెట్ నిర్వహిస్తున్నారని ఆమె ఆరోపించారు. ప్రస్తుతం సదరు సంస్థ బండ్లగూడ తదితర ప్రాంతాలలో మహిళ సేవా పేరిట ఆమాయక మహిళలను మోసం చేస్తూ రహస్యంగ చట్టవిరుద్ధ కార్యకాలపాలకు పాల్పడుతుందని తెలిపారు.

# మై భారత్...యువత కోసం జాతీయ వేదిక

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3:యువత భాగస్వామ్యాన్ని పెంపొందించే వేదిక మైభారత్. ఇది ప్రయోగాత్మక, స్వచ్ఛంద కార్యక్రమాల్లో యువతను పాల్గొనేలా చేస్తుంది. భాగస్వామ్య మంత్రిత్వ శాఖలు, సంస్థలు నిర్వహించే కార్యక్రమాల్లో సైతం భాగం చేస్తుంది.. అలాగే యువత నమోదు, ప్రొఫైల్ రూపకల్పనను సులభతరం చేస్తుంది. యువత భాగస్వామ్యం అవుతున్న స్థాయిలో, డిజిటల్ కార్యకలాపాల్లో సాధించిన వృద్ధిని అంచనా వేయడానికి వీలుగా రిజిస్ట్రేషన్లు, కార్యకలాపాల జాబితా, నూతన భాగస్వాములు, భాగస్వామ్య స్థాయిలు లాంటి సూచికలను ఈ వేదిక అందిస్తోంది.

నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగకల్పనకు అంకితమైన లేదా ప్లేస్‌మెంట్ పోర్టల్‌గా మై భారత్ పనిచేయడం లేదు. దీనిలో యువత భాగస్వామ్యానికి సంబంధించినవి మినహా.. ఉపాధి ఫలితాలను కొలిచే సూచికలను దీనిలో పొందుపరచలేదు. యువత స్వచ్ఛందంగా పాల్గొనే వేదికగా మాత్రమే మై భారత్ పోర్టల్ పనిచేస్తుంది కానీ ఉద్యోగాల కల్పనకు సంబంధించిన పోర్టల్‌గా కాదు. ఈ వేదిక ఉద్దేశం ప్రత్యక్ష ఉద్యోగాలు లేదా ఉపాధి కల్పనతో అనుసంధానమవడం కాదు.

పర్యవేక్షణ, నివేదికల నిబంధనలు:

2025-26లో మై భారత్ ద్వారా చేపట్టిన కార్యక్రమాలను.. పోర్టల్‌కు అనుసంధానించిన ప్రత్యేక ఇంటర్నల్ డ్యాష్ బోర్డు ద్వారా పర్యవేక్షిస్తారు. యువత భాగస్వామ్యం, నిర్వహించిన కార్యక్రమాలు, మంత్రిత్వ శాఖలు/విభాగాలు, ఇతర భాగస్వాములతో ఒప్పందాలకు సంబంధించిన సమాచారాన్ని ఈ డ్యాష్ బోర్డు ఎప్పటికప్పుడు నమోదు చేస్తుంది.

ఈ వేదిక ద్వారా చేపట్టిన ప్రధాన కార్యక్రమాలు:

2025-26లో ఈ పోర్టల్ ద్వారా జాతీయ యువజనోత్సవం: వికసిత భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ (వీబీవైఎల్‌డీ)-2026తో సహా అనేక కార్యక్రమాలను యువజన వ్యవహారాల విభాగం నిర్వహించింది. వీబీవైఎల్‌డీ పరిధిలో జాతీయ స్థాయిలో నిర్వహించిన క్విజ్, వ్యాస రచన, హ్యాక్ ఫర్ సోషల్ కాజ్, డిజైన్ ఫర్ భారత్ కార్యక్రమాలు, కవితా రచన, చిత్ర లేఖనం, జానపద సంగీతం, జానపద నృత్యం లాంటి సాంస్కృతిక కార్యక్రమాల్లో లక్షల సంఖ్యలో యువత పాల్గొంది. స్వచ్ఛంద సేవా కార్యక్రమాలను నిర్వహించడానికి జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) మై భారత్ వేదికను ఉపయోగించుకుంటోంది. అలాగే ఏకీకృత డిజిటల్ పర్యవేక్షణ వ్యవస్థ ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న సంస్థలకు చెందిన స్వచ్ఛంద సేవకులు పాల్గొనే వీలు కల్పిస్తోంది.

# సిపిఆర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి- కాకుమాను జ్యోతి

హైదరాబాద్ ఫిబ్రవరి 3 (ఎక్స్ ప్రేవ్స్ న్యూస్ );మన ఆరోగ్యం మన చేతుల్లోనేఉన్నదని టాటా హెయిల్ మణి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు, ఫోస్టినా ఫౌండేషన్ జాతీయ చైర్ పర్సన్ కాకుమాను లూర్దు జ్యోతి అన్నారు.గాంధీ మెడికల్ కాలేజీ ఆవరణలో అలుమ్ని అసోసియేషన్, జనహిత సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెండు రోజుల అఖఖీ శిక్షణ కార్యక్రమానికి ఆమె విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కల్తీ ఆహారం, కలుషితమైన వాతావరణం వలన కూడా వివిధ రకాల ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని చెప్పారు. మన ముందు జనరేషన్ వారు ఎలాంటి కల్తీ లేని ఆహారం తీసుకోవడం వలన ఎంతో ఆరోగ్యంగా ఉన్నారని, ఎక్కువకాలం పాటు ఎలాంటి అనారోగ్య సమస్యలు లేకుండా జీవించారని వివరించారు. ప్రస్తుతం మనం కల్తీ ఆహారం తినడం, ఆరోగ్యపరంగా తగు జాగ్రత్తలు తీసుకోకపోవడం వలన పలు రకాల ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నామని చెప్పారు. ప్రస్తుత కాలంలో ప్రధానంగా గుండె సంబంధిత సమస్యలతో బాధపడే వారి సంఖ్య గణనీయంగా పెరిగిన విషయాన్ని గుర్తు చేశారు.గుండెపోటుకు గురైన వారికి తక్షణమే అఖఖీ చేయడం వలన మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రికి తరలించే వరకు బ్రతికించే అవకాశాలు ఉంటాయని అన్నారు.

# కోడలి అక్రమ సంబంధానికి మామ అడ్డు..నది రోడ్డు పై మామను తగులబెట్టిన కోడలు ప్రియుడు

చెన్నై ఫిబ్రవరి 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: కోడలి అక్రమ సంబంధానికి మామ అడ్డుగా ఉండడంతో అతడిని నడిరోడ్డులో తగలబెట్టిన సంఘటన తమిళనాడు రాష్ట్రం కడలూరు జిల్లాలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పన్రుటి ప్రాంతంలో రాజేంద్రన్ అనే అనే రైతు తన కుమారుడికి జయప్రియ అనే మహిళతో పెళ్లి చేశాడు. కొన్ని రోజుల క్రితం కుమారుడు చనిపోవడంతో జయప్రియ మరోక వ్యక్తి మణికందన్ తో అక్రమ సంబంధం పెట్టుకుంది. కోడలు వివాహేతర సంబంధం మామకు తెలియడంతో ఆమెను వ్యతిరేకించాడు. దీంతో ఇద్దరు మధ్య గత కొన్ని రోజుల నుంచి గొడవలు జరుగుతున్నాయి. మణికందన్ కూడా ప్రియురాలి మామ మందలించడంతో అతడిపై ఆగ్రహంతో రగిలిపోతున్నాడు. జనవరి 29న తన స్నేహితుడితో కలిసి బైక్ పై వెళ్తుండగా మణికందన్ తన అనుచరులతో కలిసి వారిని అడ్డుకున్నారు. రాజేంద్రన్ పై పెట్రోల్ పోసి తగలబెట్టాడు. మంటల్లో చిక్కుకున్న రాజేంద్రన్ ప్రాణభయంతో రోడ్డుపై పరుగుల తీశాడు.

# అందరికీ కుళాయి నీటిని అందిచటమే లక్ష్యం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3:దేశ వ్యాప్తంగా ప్రతి గ్రామీణ గృహానికి తాగునీటిని అందించే లక్ష్యంతో భారత ప్రభుత్వం ఆగస్టు 2019 నుంచి రాష్ట్రాల భాగస్వామ్యంతో జల్ జీవన్ మిషన్ (జేజేఎం) - హర్ ఘర్ జల్ పథకాన్ని అమలు చేస్తోంది. తాగునీరు రాష్ట్ర పరిధిలోని అంశమైనప్పటికీ రాష్ట్ర ప్రయత్నాలకు తోడ్పాటునందించేందుకు భారత ప్రభుత్వం సాంకేతిక, ఆర్థిక సహాయాన్ని అందిస్తుంది.

జల్ జీవన్ మిషన్ ప్రారంభమైనప్పటి నుంచి దేశంలోని గ్రామీణ గృహాలకు కుళాయి నీటి సరఫరా గణనీయంగా మెరుగుపడింది. ఆగస్టు 2019లో పథకం ప్రారంభమైనప్పుడు దేశవ్యాప్తంగా కేవలం 3.23 కోట్ల (16.72%) గ్రామీణ కుటుంబాలకు కుళాయి నీటి కనెక్షన్లు ఉన్నట్లు నివేదికలున్నాయి. జేజేఎం ద్వారా ఇప్పటివరకు 12.55 కోట్ల అదనపు గ్రామీణ కుటుంబాలకు కుళాయి నీటి కనెక్షన్లనిచ్చారు. 28.01.2026 నాటికి దేశంలోని మొత్తం 19.36 కోట్ల గ్రామీణ గృహాల్లో 15.79 కోట్లకు పైగా (81.56%) ఇళ్లకు నేరుగా కుళాయి నీరు అందుతున్నట్లు నమోదైంది.

ఈ మిషన్ మొత్తం అంచనా వ్యయం రూ.3.60 లక్షల కోట్లు కాగా, కేంద్ర ప్రభుత్వ వాటా రూ.2.08 లక్షల కోట్లు. కేంద్రం కేటాయించిన నిధులు 2024-25 నాటికే దాదాపు వినియోగించారు. ఇప్పటివరకు సాధించిన పురోగతిని, ప్రస్తుతం కొనసాగుతున్న పనులను పరిగణలోకి తీసుకుని జల్ జీవన్ మిషన్ను డిసెంబర్ 2028 వరకు పొడిగిస్తున్నామని, ఇందుకోసం కేటాయింపులను కూడా పెంచినట్టు 2025-26 బడ్జెట్ ప్రకటనలో ఆర్థిక మంత్రి వెల్లడించారు. జల్ జీవన్ మిషన్ను డిసెంబర్ 2028 వరకు కొనసాగించే ప్రతిపాదన సంబంధిత శాఖ పరిశీలనలో ఉంది.

జల్ జీవన్ మిషన్ ప్రారంభమైనప్పటి నుంచి వికేంద్రీకృత, డిమాండ్ ఆధారిత, సంఘ నిర్వహణతో అమలవుతోంది. గ్రామీణ గృహాలకు క్రమంగా, భరోసాతో కుళాయి నీటిని సరఫరా చేసేందుకు గ్రామ పంచాయతీ, దాని ఉపకమిటీలు, వినియోగదారుల బృందాలైన గ్రామ నీటి, పారిశుద్ధ్య కమిటీ (వీడబ్ల్యూఎస్సీ), పానీ సమితిలకు అధికారం కల్పించారు. నీటి సరఫరా వ్యవస్థల కోసం ప్రణాళికను రూపొందించటం, అమలు చేయటం, నిర్వహించటం, పర్యవేక్షణ బాధ్యతలను గ్రామ స్థాయిలో ఈ కమిటీలే చేపడతాయి.

జేజేఎం ద్వారా ఎన్జీవోలు, సామాజిక సంస్థలు (సీబీఓలు), స్వయం సహాయక సంఘాలు (ఎస్హెచ్జీలు), ఇతర స్వచ్ఛంద సంస్థలను (వీవోలు) అమలు మద్దతు సంస్థలు (ఐఎస్ఏలు)గా ఎంపిక చేశారు. ఇవి ప్రణాళికను రూపొందించటం, సామాజిక చైతన్యం కల్పించటం, భాగస్వామ్యాన్ని పెంపొందించటం, సమాచారాన్ని తెలియజేయటం, నీటి సరఫరా భూగర్భ వనరుల దీర్ఘకాలిక నిర్వహణ మహిళల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించటం వంటి అంశాల్లో వీడబ్ల్యూఎస్సీలు, పానీ సమితులకు శిక్షణ ఇవ్వటం, మార్గనిర్దేశం చేయటానికి పనిచేస్తాయి.

ప్రణాళిక రూపకల్పన, అమలులో క్రియాశీల పాత్ర పోషించేలా, నిర్వహణ బాధ్యతలను స్వీకరించేలా స్థానిక ప్రజలను ప్రోత్సాహించేందుకు నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ సహకారంతో నల్ జల్ మిత్ర (ఎన్జేఎంపీ) కార్యక్రమం ప్రారంభించారు. దీనిద్వారా గ్రామస్థులకు సమగ్ర నైపుణ్య శిక్షణ అందించి, వారిని "నల్ జల్ మిత్రులు"గా తీర్చిదిద్దటం వల్ల గ్రామాల్లో పైపుల ద్వారా జరిగే నీటి సరఫరా పథకాలకు ఆపరేటర్లుగా వ్యవహరించటమే కాక, నైపుణ్యం గల మేస్త్రీలు, ప్లంబర్లు, ఫిట్టర్లు, ఎలక్ట్రీషియన్లు, మోటార్ మెకానిక్స్, పంపు ఆపరేటర్లుగా చిన్నపాటి మరమ్మతులు, ముందస్తు నిర్వహణ పనులను స్వయంగా చేసుకోగలుగుతారు.

పారదర్శకతను పెంపొందించటానికి, సుస్థిరమైన, నిరంతర సేవలందించేందుకు జన్ భాగీదారీని ప్రోత్సహించటానికి జల్ అర్పణ్ ద్వారా "హ్యాండ్ ఆన్ కమ్యూనిటీ మేనేజ్డ్ పైప్డ్ వాటర్ సిస్టమ్స్"ను ప్రామాణీకరించారు. ఇందులో భాగంగా సులభతర బదిలీ, సుస్థిర నిర్వహణకు జీపీలు, వీడబ్ల్యూఎస్సీ సభ్యుల భాగస్వామ్యంతో తప్పనిసరిగా 15 రోజుల పాటు ట్రయల్ రన్ నిర్వహించాలి.

ప్రజల ఫీడ్బ్యాక్, ఫిర్యాదుల పరిష్కారానికి జిల్లా, గ్రామ పంచాయతీ స్థాయి డాష్బోర్డులను ప్రారంభించి, వాటిని మేరీ పంచాయత్ వేదికతో అనుసంధానించారు. తాగునీటి సేవల పనితీరును అంచనా వేయటానికి గ్రామ పంచాయతీ నేతృత్వంలోని డిజిటల్ అసెస్మెంట్ సాధనాన్ని ప్రారంభించారు.

జల్ జీవన్ మిషన్ ద్వారా వనరుల పునరుద్ధరణ, స్థానిక తాగునీటి వనరుల పెంపు, మురుగునీటి శుద్ధి, పునర్వినియోగం, భూగర్భ జలాల పెంపు, వర్షపు నీటి సంరక్షణ వంటివి చేపట్టాలని రాష్ట్రాలకు కేంద్రం సూచించింది. వీబీ-జీ రామ్ జీ, సమీకృత వాటర్షెడ్ నిర్వహణ కార్యక్రమం (ఐడబ్ల్యుఎంపీ), స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ్) వంటి పథకాలతో స్థానిక సంస్థలు లేదా పంచాయతీరాజ్ సంస్థలకు ఆర్థిక సంఘం కేటాయించిన నిధులను సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని తెలిపింది.

జేజేఎం మార్గదర్శకాల ప్రకారం పైప్డ్ వాటర్ సప్లై పథకాల ద్వారా సరఫరా అయ్యే నీటి నాణ్యతను కొలిచేందుకు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ బీఐఎస్:10500ను ప్రామాణికంగా స్వీకరించారు. జల్ జీవన్ మిషన్ ద్వారా గృహాలకు కుళాయి నీటి సరఫరాకు పథక ప్రణాళిక చేసేప్పుడు ఆర్సెనిక్, ఫ్లోరైడ్ వంటి రసాయనాల ప్రభావమున్న ప్రాంతాలకు ప్రాధాన్యతనిస్తారు.

నీటి నాణ్యతా సమస్యలున్న గ్రామాల్లో, ప్రత్యామ్నాయ సురక్షిత నీటి వనరుల ఆధారంగా పైపుల ద్వారా నీటి సరఫరా పథకాలను రూపొందించి, అమలు చేయాలని రాష్ట్రాలు, యూటీలకు కేంద్రం సూచించింది. జల్ జీవన్ మిషన్ (జేజేఎం) ద్వారా ముఖ్యంగా ఆర్సెనిక్, ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాల్లో కమ్యూనిటీ వాటర్ ప్యూరిఫికేషన్ ప్లాంట్లను (సీడబ్ల్యూపీపీలు) ఏర్పాటు చేసి, ప్రతి ఇంటికి తాగునీరు, వంట అవసరాలకు (వ్యక్తికి రోజుకు 8-10 లీటర్ల చొప్పున) సురక్షితమైన నీటిని అందించాలని రాష్ట్రాలు, యూటీలకు తెలిపింది. ఇప్పటివరకు దేశంలోని గ్రామాల్లో నివాస ప్రాంతాలకు ఆర్సెనిక్, ఫ్లోరైడ్ లేని సురక్షిత తాగునీటిని అందించగలిగారు.

జేజేఎం ద్వారా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కేటాయించిన వార్షిక నిధుల్లో 2% వరకు నీటి నాణ్యతా పర్యవేక్షణ, నిఘా (డబ్ల్యు క్యూఎంఎస్) కార్యకలాపాలకు వినియోగించుకోవచ్చు. ఇందులో నీటి నాణ్యతా పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసి, బలోపేతం చేయటం, అవసరమైన పరికరాలు, యంత్రాలు, రసాయనాలు, గాజు పరికరాలు, ఇతర వినియోగ వస్తువుల కొనుగోలు, నైపుణ్యం గల మానవ వనరుల నియామకం, ఫీల్డ్ టెస్ట్ కిట్ల (ఎఫ్టీకేల) ద్వారా కమ్యూనిటీ నిఘా, అవగాహన పెంపొందించటం, నీటి నాణ్యతపై విద్యా కార్యక్రమాలు నిర్వహించటం, ప్రయోగశాలకు అక్రిడేషన్ లేదా గుర్తింపునివ్వటం వంటి కార్యకలా పాలుంటాయి.

రాష్ట్రాలు, యూటీలు నీటి నమూనాలను పరీక్షించటానికి, తాగు నీటి నమూనాల సేకరణ, రిపోర్టింగ్, పర్యవేక్షణ, నిఘా కోసం జేజేఎం- నీటి నాణ్యతా నిర్వహణ సమాచార వ్యవస్థ (డబ్ల్యూక్యూఎంఐఎస్) ఆన్లైన్ పోర్టల్ను అభివృద్ధి చేశాం. నీటి నాణ్యత పరీక్షలకు సంబంధించి డబ్ల్యూక్యూఎంఐఎస్లో నివేదించిన వివరాలు రాష్ట్రాల వారీగా జేజేఎం డాష్బోర్డులో పబ్లిక్ డొమైన్లో అందుబాటులో ఉన్నాయి.

జేజేఎం డాష్బోర్డులో 'సిటిజన్ కార్నర్' విభాగాన్ని అభివృద్ధి చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో పీడబ్ల్యూఎస్ ద్వారా సరఫరా అయ్యే నీటి నాణ్యతపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు, వారిలో విశ్వాసాన్ని పెంపొందించేందుకు గ్రామస్థాయిలోని నీటి నాణ్యతా పరీక్షా ఫలితాలను ఈ విభాగం ద్వారా బహిరంగంగా అందుబాటులో ఉంచుతారు.

మార్చి 2023లో "హ్యాండ్ బుక్ ఆన్ డ్రింకింగ్ వాటర్ ట్రీట్మెంట్ టెక్నాలజీస్", డిసెంబర్ 2024లో పైపుల ద్వారా అందిస్తున్న నీటి నాణ్యత వాస్తవ పరిస్థితిపై ఒక చిన్న పుస్తకాన్ని జల విభాగం విడుదల చేసింది. సురక్షితమైన నీటి సరఫరా వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించేందుకు క్షేత్రస్థాయి సిబ్బందికి మార్గనిర్దేశం చేయటమే ఈ రెండింటి లక్ష్యం.

రాజ్యసభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి శ్రీ వి. సోమన్న లిఖితపూర్వక సమాధానంగా ఇవాళ ఈ సమాచారాన్ని అందించారు.

# బూటకపు హామీలు-మోసపూరిత వాగ్దానాలు

## -కాంగ్రెస్ అరాచక, అవినీతి పాలనపై బిజెపి చార్జ్షీట్ విడుదల



హైదరాబాద్ ఫిబ్రవరి 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల పాలనలో ఘోర వైఫల్యాలు, అమలు కాని హామీలు, విస్తరిస్తున్న అవినీతి అరాచకాలతో ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ పేర్కొంది. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తూ, ప్రజలకు చేసిన మోసాలను ఎండగడుతూ "బూటకపు హామీలు - మోసపూరిత వాగ్దానాలు" పేరిట భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ చార్జ్షీట్ను విడుదల చేసింది. ఈ చార్జ్షీట్ను బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు , మహారాష్ట్ర మంత్రి, తెలంగాణ మున్సిపల్ ఉ కార్పొరేషన్ ఎన్నికల ఇంచార్జ్ అశిష్ షెలార్ పార్టీ సీనియర్ నాయకుల సమక్షంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మున్సిపల్ ఉ కార్పొరేషన్ ఎన్నికల కో-ఇంచార్జులు అశోక్ పర్ణామి , ఎంపీ ఈటల రాజేందర్ , పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. ఎన్. గౌతం రావు , రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి, మీడియా ఇన్చార్జ్ ఎన్.వి. సుభాష్, సీనియర్ నాయకులు జి. వెంకట్ రెడ్డి , సునీత , విఠల్ , కప్పర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల వేళ గద్వాల కాంగ్రెస్లో గందరగోళ పరిస్థితి



జోగులాంబ గద్వాల ఫిబ్రవరి 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );మున్సిపల్ ఎన్నికల వేళ గద్వాల కాంగ్రెస్లో గందరగోళ పరిస్థితి నెలకొంది. జోగులాంబ గద్వాల మున్సిపల్ ఎన్నికల్లో సీట్ల పంపకాల వ్యవహారం కొలిక్కి రావడంతో.. 37 వార్డులకుగాను 7 సీట్లను సరిత తిరుపతయ్య వర్గం, 30 సీట్లు ఎమ్మెల్యే బండ్ల వర్గానికి కేటాయించారు. అయితే ముందుగానే నేడు ఉదయం ఎమ్మెల్యే బండ్ల వర్గానికి మొత్తం 37 వార్డులకుగాను అభ్యర్థులకు కాంగ్రెస్ పార్టీ బీ ఫాంలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే వర్గానికి చెందిన అభ్యర్థులంతా అధికారులకు బీ ఫామ్లను సమర్పించారు. ఇదిలా ఉంటే మరోవైపు సరితా తిరుపతయ్య వర్గం తమకు అధిష్టానం 7 వార్డులను కేటాయించిందంటూ బీ ఫామ్లతో దర్శనమిచ్చారు. కాగా ఆ 7 వార్డులకు ఇప్పటికే ఎమ్మెల్యే బండ్ల వర్గానికి చెందిన అభ్యర్థులు బీ ఫామ్లు సమర్పించారు. ఇలా ఒకేసారి 7 వార్డులకు రెండు వర్గాలకు కాంగ్రెస్ బీ ఫామ్లు ఇవ్వడం పట్ల గందరగోళ పరిస్థితి నెలకొంది. రెండు వర్గాలకు చెందిన వ్యక్తుల్లో ఇంతకీ ఎవరి బీ ఫామ్లు చెల్లుతాయనేది తెలియాల్సి ఉంది.

# డ్రగ్స్ వ్యతిరేక ఉద్యమంలో అందరూ భాగస్వామ్యం కావాలి..

**-510 కిలోమీటర్ల డ్రగ్స్ వ్యతిరేక సైకిల్ యాత్ర ..**
**-డ్రగ్స్కు సంబంధించిన సమాచారం 112 లేదా 1972కు కాల్ చేయండి?..**
**-సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వర రావు?**
**-డ్రోన్లు, 12,000 సీసీ కెమెరాలు, న్యాట్గ్రిడ్ డేటాబేస్ ద్వారా నగరంపై ఉక్కుపాదం?.**
**-నగర సీపీ రాజశేఖర్ బాబు.**

విజయవాడ ఫిబ్రవరి 3: డ్రగ్స్ వ్యతిరేకపై ప్రభుత్వం ఉద్యమం మొదలు పెట్టింది. ఈ ఉద్యమంలో అందరూ భాగస్వామ్యం కావాలని ప్రభుత్వ అధికారులు పిలుపునిచ్చారు. సుమారు 510 కిలోమీటర్ల డ్రగ్స్ వ్యతిరేక ఉద్యమంపై ప్రభుత్వ అధికారులు సైకిల్ యాత్ర నిర్వహించారు. డ్రగ్స్కు సంబంధించిన సమాచారం 112 లేదా 1972కు కాల్ చేయాలని సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వర రావు పిలుపునిచ్చారు. ఇందుకుగాను డ్రోన్లు, 12,000 సీసీ కెమెరాలు, న్యాట్గ్రిడ్ డేటాబేస్ ద్వారా నగరంపై ఉక్కుపాదం మోపుతున్నట్లు నగర సీపీ రాజశేఖర్ బాబు పేర్కొన్నారు.

విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలోని సత్యనారాయణపురం బి. ఆర్. టి. ఎస్. రోడ్డులో శారదా కళాశాల జంక్షన్ వద్ద డ్రగ్స్ వద్దు ఆరోగ్యమైన సమాజం కావాలి అనే నినాదంతో ఎన్టీఆర్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 510 కిలోమీటర్ల డ్రగ్స్ వ్యతిరేక సైకిల్ యాత్ర ఎనిమిదవ రోజు అత్యంత ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యుడు బొండా ఉమామహేశ్వర



రావు,నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబుతో కలసి సైకిల్ యాత్రలో పాల్గొని, ప్రజల్లో డ్రగ్స్పై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా బొండా ఉమామహేశ్వర రావు మాట్లాడుతూ గత ప్రభుత్వాల పరిపాలనలో రాష్ట్రంలో పరిస్థితి అత్యంత దారుణంగా ఉండేదని, ఏ రోడ్డుపై వెళ్లినా, ఏ మహిళా కేంద్రానికి వెళ్లినా గంజాయి ప్రభావం స్పష్టంగా కనిపించేదని, నేషనల్ క్రైమ్ బ్యూరో రికార్డుల ప్రకారం 2019-2024 మధ్యకాలంలో భారతదేశంలో గంజాయి వినియోగం అత్యధికంగా ఉన్న రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచిందని, దీని కారణంగా రాష్ట్రం దేశవ్యాప్తంగా క్రైమ్ రికార్డుల్లోకి వెళ్లిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. అయితే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృఢ సంకల్పం, స్పష్టమైన ఆదేశాలు సమర్థవంతమైన పోలీస్ యంత్రాంగం, నిబద్ధత కలిగిన అధికారుల కృషితో నేడు పరిస్థితి పూర్తిగా మారిందని, గంజాయి నియంత్రణపై తీసుకున్న కఠిన చర్యల వల్ల రాష్ట్రంలో క్రైమ్ రేటు దాదాపు 70 శాతం వరకు తగ్గడం ఒక చారిత్రాత్మక విజయం అని అన్నారు.

# కేంద్ర బడ్జెటుపై యువతలో అవగాహనను పెంచడానికి

## 'మై భారత్ బడ్జెట్ క్వెస్ట్-2026'ను ప్రారంభించిన డాక్టర్ మన్సుఖ్ మాండవీయ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3:'మై భారత్ బడ్జెట్ క్వెస్ట్ - 2026'ను కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ ఈ రోజు ప్రారంభించారు. కేంద్ర బడ్జెటుపై దేశ యువతీయువకుల్లో అవగాహనను పెంపొందించడంతో పాటు, బడ్జెటులో చేసిన కేటాయింపుల్ని మరింత ఎక్కువ మంది అర్థం చేసుకోవడం కోసం దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. కళాశాలలు, సంస్థలు, శిక్షణ కేంద్రాల్లోని యువతను నిర్దిష్ట ప్రాతినిధ్య ప్రణాళిక ద్వారా భాగస్తుల్ని చేసి, పౌరులు తమ నిత్య జీవితంలో 2026 కేంద్ర బడ్జెటుకు ఉన్న ప్రాధాన్యాన్ని గ్రహించేలా చూడాలనేదే ఈ కార్యక్రమం ఉద్దేశం.

ఈ పోటీ రేపటి నుంచి.. అంటే 2026 ఫిబ్రవరి 3 నుంచి.. మొదలవుతుందని కేంద్ర మంత్రి తెలిపారు. ఇది 2026 కేంద్ర బడ్జెటుకు సంబంధించిన జాతీయ స్థాయి ఆన్లైన్ క్విజ్. మై భారత్ పోర్టల్లో పేర్లు నమోదు చేసుకున్న యువతీ యువకులు దీనిలో పాల్గొనవచ్చు. ఈ క్విజ్లో పాల్గొనడానికి ఫిబ్రవరి 17 ఆఖరి గడువుతేదీ. దీని తరువాత, ప్రతి ఒక్క రాష్ట్రంలో, కేంద్రపాలిత ప్రాంతంలో అగ్రగాములుగా నిలిచిన వారిని ఎంపిక చేస్తారు. వారు ఫిబ్రవరి 17 నుంచి 2026 మార్చి 3 వరకు రెండో విడత పోటీలో పాల్గొంటారు. ఈ విడతలో వ్యాసరచన పోటీని నిర్వహిస్తారు. వికసిత్ భారత్ దృష్టికోణానికి అనుగుణంగా కేంద్ర బడ్జెటులోని 8 అంశాలను దీనిలో భాగంగా యువతకు సూచిస్తారు. పోటీలో పాల్గొనేవారు తమ అభిప్రాయాల్నీ, ఆలోచనల్నీ వ్యాసాల రూపంలో తెలియజేస్తారు.

"వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ (వీబీవైఎల్డీ)లో యువజనులు వ్యక్తం చేసిన కొత్త కొత్త ఆలోచనల్ని గౌరవ ఆర్థిక మంత్రి ఈ సంవత్సర బడ్జెటు ప్రసంగంలో అభినందించడంతో పాటు, వాటిలో నుంచి కొన్ని ఆలోచనల్ని 2026-27 కేంద్ర బడ్జెటులో ప్రస్తావించారు" అని కేంద్ర మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ అన్నారు. 'మై భారత్ బడ్జెట్ క్వెస్ట్ను నిర్వహించి ఈ భావనను ముందుకు తీసుకుపోయి, యువ వాణికి మరింత సాధికారితను అందించాలని మేం కోరుకుంటున్నాం' అని కూడా ఆయన వివరించారు.

వ్యాసాల మూల్యాంకనాన్ని 2026 మార్చి 3 మొదలు అదే నెల 10 మధ్య చేపడుతారు. రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల వారీ ప్రతిభావంతుల జాబితాల్ని 2026 మార్చి 10న ప్రకటిస్తారు. రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల విజేతలు ఆ తరువాత వికసిత్ భారత్ దార్శనికత అంశంపై ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీతో వర్చువల్ మాధ్యమం ద్వారా ఏర్పాటు చేసే ఒక సంభాషణ కార్యక్రమంలో పాలుపంచుకొంటారు. జాతీయ ఆర్థిక పరిణామాలు, అభివృద్ధి ప్రాధాన్యాలకు సంబంధించిన విషయాలపై యువతలో అవగాహననీ, యువత ప్రాతినిధ్యాన్నీ పెంచడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ కార్యక్రమ నిర్వహణ పునరుద్ఘాటిస్తున్నది.

# ఎత్తిపోతల పథకం నిలిచిపోవడానికి కారణం వైయస్ జగన్మోహన్ రెడ్డి

అమరావతి, ఫిబ్రవరి 3:రాయలసీమ ఎత్తిపోతల పథకం నిలిచిపోవడానికి ప్రధాన కారణం వైయస్ జగన్మోహన్ రెడ్డి అని ఎమ్మెల్యే కే ఈ శ్యాం కుమార్ ఆరోపించారు. మంగళవారం రాతన గ్రామంలో హంద్రీ నీవా కాలువ ద్వారా 108 చెరువులు నింపే ప్రాజెక్టులో భాగంగా రాతన చెరువును కృష్ణా జలాలతో నింపిన సందర్భంగా ఎమ్మెల్యే కే ఈ శ్యామ్ కుమార్, జిల్లా గ్రంథాల చైర్మన్ తుగ్గలి నాగేంద్ర, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ బత్తిన వెంకట్రాముడు, టిడిపి రైతు విభాగపు రాష్ట్ర ఉపాధ్యక్షులు మనోహర్ చౌదరి లు చెరువులు పరిశీలించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కే ఈ శ్యామ్ కుమార్ మాట్లాడుతూ రాయలసీమ ఎత్తిపోతల పథకం నిలిచిపోవడానికి ప్రధాన కారణం వైఎస్ జగన్మోహన్ రెడ్డేనని అన్నారు. ఇది ముమ్మాటికీ రాయలసీమకు జగన్ చేసిన ద్రోహమేనన్నారు. జగన్ రెడ్డి చేసిన తప్పు చేసి కప్పిపెట్టి, తమ ప్రభుత్వంపై బురద జల్లడం సరికాదన్నారు. 40 ఏళ్లలో వైఎస్ కుటుంబం చేయలేని పనిని సీఎం చంద్రబాబు చేసి చూపించారని కొనియాడారు. రాయలసీమను హార్టీకల్చర్ హబ్ గా సీఎం చంద్రబాబు తీర్చిదిద్దారని అన్నారు .హంద్రనీవా ద్వారా కర్నూల్ నుండీ కుప్పం వరకూ సాగు నీరందించామని వెల్లడించారు.

రాష్ట్రంలో ప్రతి ఎకరాకు నీరందించేలా సీఎం చంద్రబాబు రేయింబవళ్లు కృషి చేస్తున్నారన్నారు.

రాయలసీమకు తాగు, సాగునీరు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుదేనిస్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు తిరుపాలు నాయుడు, ఈరన్న స్వామి, ఆవుల మైరాముడు మహిళ టిడిపి అధ్యక్షురాలు రాతన ఈరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# గ్యారెంటీలపై ముఖం చాటేసిన ప్రభుత్వం

## -బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్ ఫిబ్రవరి 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్ )రెండు లక్షల ఉద్యోగాలు మొదటి ఏడాదిలోనే అని ఇచ్చిన మరో గ్యారెంటీ నుంచి నిస్సిగ్గుగా ముఖం చాటేసిన ముఖ్యమంత్రిని చూసి తెలంగాణ నిరుద్యోగుల ఆగ్రహం కట్టలు తెంచుకుంటున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తెలంగాణ భవన్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని అడ్డదారిలో గద్దెనెక్కిన రేవంత్.. తీరా అది ఐదేళ్ల హామీ అని, పీసీసీ చీఫ్తో సీఎం పలికిస్తున్న చిలుక పలుకులు చూసి యువతరం ఛీకొడుతోందని అన్నారు. తొలి సంవత్సరమే రెండు లక్షల నియామకాలు చేపట్టకపోతే ప్రభుత్వాన్ని దించేయండని ఢిల్లీ నుంచి వచ్చి మరీ చెప్పిపోయిన ప్రియాంక గాంధీ మాట అమలై ఉంటే.. ఈ దగాకోరు సర్కారు కుప్పకూలి ఇప్పటికే ఏడాది పూర్తయ్యేదన్నారు కేటీఆర్ . కేసీఆర్ హయాంలో చివరి దశలో ఉన్న 65 వేల ఉద్యోగాలకు నియామక పత్రాలు ఇచ్చి ఫోటోలకు ఫోజులు కొట్టిన సీఎం, ఆ తరువాత మొత్తానికే చేతులెత్తేయడంతోనే తెలంగాణలో 'రిక్రూట్మెంట్ జీరో'గా మారిపోయిందని కాంగ్రెస్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను ఎండగట్టారు.

**జాబ్ క్యాలెండర్కు పాతరేసి..**

అప్పటికే లక్షా 65 వేల ఉద్యోగాలను భర్తీ చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వంపై పనిగట్టుకుని రేవంత్ చల్లిన బురద అంతా అబద్ధాలతో అందలం ఎక్కడానికేనని అందరికీ అర్థమైపోయిందని, పట్టుమని 10 వేల కొత్త ఉద్యోగాలకు కూడా నోటిఫికేషన్లు ఇవ్వని చేతకాని దద్దమ్మ పాలన చూసి నిరుద్యోగులే కాదు, వారి తల్లిదండ్రులు కూడా దుమ్మెత్తి పోస్తున్నారన్నారు. జాబ్ క్యాలెండర్కు పాతరేసి, వరుస కుంభకోణాలతో రేవంత్ సర్కారు జేబులు నింపుకుంటున్న తీరును నిత్యం తెలంగాణ సమాజం గమనిస్తూనే ఉందని, రెండు లక్షల ఉద్యోగాల హామీపై నాలుక మడతేసినంత మాత్రాన నాలుగు కోట్ల ప్రజలు ఊరుకుంటారని, ముఖ్యమంత్రి చేసిన మోసాన్ని మరిచిపోతారని అనుకుంటే అది పొరపాటే అని హెచ్చరించారు.

తెలంగాణ నిరుద్యోగులను నమ్మించి నయవంచన చేసినందుకు ముఖ్యమంత్రి ముక్కున వేలేసుకుని క్షమాపణలు చెప్పినా, పొర్లుదండాలు పెట్టినా క్షమించే ప్రసక్తే లేదని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిరుద్యోగులకు, విద్యార్థులకు చేస్తున్న ఈ ద్రోహంపై వెంటాడుతామన్నారు.

**మీరు చేసిన పాపం ఊరికే పోదు..**

మేధావుల ముసుగు వేసుకుని మాయమాటలతో మభ్యపెట్టిన గొంతులన్నీ గత రెండేళ్ల నుంచి మూగబోయినంత మాత్రాన మీరు చేసిన పాపం ఊరికే పోదని, నిరుద్యోగులకు, యువతకు అండగా ఉండాల్సిన బాధ్యత ఉందన్నారు కేటీఆర్. కేవలం నిరుద్యోగులను మాత్రమే కాకుండా రాష్ట్రంలోని అన్ని వర్గాలను రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ఇప్పటికే మూడు దఫాలుగా రైతుబంధు ఎగ్గొట్టి 70 లక్షల మంది అన్నదాతల పొట్టకొట్టారు. కేసీఆర్ పాలనలో ఆత్మగౌరవంతో బతికిన రైతన్నను మళ్లీ అప్పుల పాలు చేసి తీరని ద్రోహం చేశారని తెలిపారు. సీఎం సీటుపై కూర్చున్న మరుక్షణంలోనే ప్రతి మహిళకు రూ.2500 ఇస్తానని చెప్పిన మాటలకు రెండేళ్లయినా ఒక్కరికీ దిక్కులేకపోవడంతో ఆడబిడ్డలు కోపంతో రగిలిపోతున్నారన్నారు.

ఆరు గ్యారెంటీలన్నీ అక్షరాలా గారడీలేనని, 420 హామీలన్నీ నయవంచన మాత్రమేనని తన నిజస్వరూపాన్ని బయటపెట్టిన రేవంత్ సర్కారుకు నిరుద్యోగుల ఉసురు తగలడం ఖాయం అన్నారు. మెగా డీఎస్సీ పేరిట దగా, నిరుద్యోగ భృతి పేరిట చేసిన ద్రోహానికి గుణపాఠం చెప్పేందుకు ఆదిలాబాద్ నుంచి అశోక్ నగర్ చౌరస్తా వరకూ ప్రతి నిరుద్యోగి సిద్ధంగా ఉన్నాడని తెలిపారు.

చైతన్యానికి ప్రతీకైన తెలంగాణ యువత సంఘటిత శక్తిలో ఉన్న బలం ఏంటో, వారు బిగించే పిడికిళ్లు కాంగ్రెస్ పునాదులను ఎలా పెకిలిస్తాయో త్వరలోనే చూస్తామని కేటీఆర్ తెలిపారు.

# బీఆర్ఎస్ అభ్యర్థులను ఆదరించండి : మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



హైదరాబాద్, ఫిబ్రవరి 3:బీఆర్ఎస్ హయాంలో వనపర్తి జిల్లా పెబ్బేరు మున్సిపాలిటీలో చేసిన అభివృద్ధిని చూసి బీఆర్ఎస్ అభ్యర్థులను ఆదరించాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికలసందర్భంగా బీఆర్ఎస్ తరఫున పోటీచేస్తున్న అభ్యర్థులకు ఆయన మంగళవారం పెబ్బేరులో బీఫాంలు అందజేశారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వంలో కోట్లాది రూపాయల వ్యయంతో పట్టణంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు గుర్తుచేశారు. వాటిని దృష్టిలో ఉంచుకొని ఈ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్‌కు మరోసారి అవకాశం ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ముఖ్యంగా విద్యార్థి లోకానికి బీఆర్ఎస్ అండగా ఉందని చెప్పేందుకు 4వ వార్డు నుంచి ఎంబీబీఎస్ విద్యార్థిని పవిత్రను నిలబెట్టినట్లు ఆయన వెల్లడించారు. పెబ్బేరు మున్సిపాలిటీ గతం నుంచి బీఆర్ఎస్‌ను ఆదరించిందని, ఈ పర్యాయం కూడా ఎక్కువ సీట్లు వచ్చేలా ప్రజలు తమ అభ్యర్థులను ఆశీర్వదించాలని నిరంజన్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో ఎన్నికల సమన్వయకర్త మేకల కర్రెస్వామి, ఇన్‌చార్జి లక్ష్మారెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు దిలీప్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రాములు, నాయకులు రాజశేఖర్, వెంకటేశ్, విశ్వరూపం పాల్గొన్నారు.

# నడుస్తున్న ద్విచక్ర వాహనంలో ఒక్కసారిగా మంటలు.. మంటల్లో పూర్తిగా దగ్ధమైన బైక్

కొండాపూర్, ఫిబ్రవరి 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : నడుస్తున్న ద్విచక్ర వాహనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగిన సంఘటన మాదాపూర్‌లోని కేబుల్ బ్రిడ్జిపై చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..రోడ్ నెంబర్ 45 వైపు నుంచి ఐకియా వైపు తన ద్విచక్ర వాహనం(పల్సర్) పై వెళ్తున్న కొమనంతల జతిన్ కేబుల్ బ్రిడ్జి పైకి రాగానే ఒక్కసారిగి మంటలు చెలరేగాయి. గమనించిన జతిన్ బైక్ ను పక్కన ఆపడంతో ప్రమాదం తప్పింది. కాగా మంటల్లో బైక్ పూర్తిగా దగ్ధమైంది. అటుగా రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు భయాందోళనకు గురయ్యారు

# దాదాపు రూ.1.20 లక్షల కోట్ల కేటాయింపులతో భద్రతకే తొలి ప్రాధాన్యత: అశ్వినీ వైష్ణవ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3:భారత రైల్వే శరవేగంగా విస్తరణకు సిద్ధమవుతుంది. ఈ ఏడాది కేంద్ర బడ్జెట్‌లో కేటాయించిన రూ.2,78,000 కోట్ల భారీ నిధులను ప్రధానంగా హైస్పీడ్ కనెక్టివిటీ, సరుకు రవాణా, భద్రతపై వెచ్చించాలని భావిస్తోంది.

కేంద్ర బడ్జెట్ 2026-27లో భారతీయ రైల్వేలకు మునుపెన్నడూ లేనివిధంగా రూ.2,93,030 కోట్ల మూలధన వ్యయాన్ని కేటాయించారు. రైల్వే రంగానికి కేటాయించిన అత్యధిక నిధుల కేటాయింపు ఇదే.

రైల్వే మౌలిక సదుపాయాలను బలోపేతం చేయటం, సామర్థ్యాన్ని విస్తరించటం, ప్రయాణికుల భద్రతను మెరుగుపరచడానికి ప్రభుత్వ నిరంతర కృషిని ఈ కేటాయింపులు స్పష్టం చేస్తున్నాయి. ఆర్థిక వృద్ధికి, లాజిస్టిక్స్ సామర్థ్యానికి రైల్వే మౌలిక సదుపాయాలే కీలకమని ఇది ప్రతిబింబిస్తోంది. సరుకు రవాణాను మెరుగుపరచటం, రవాణా ఖర్చులను తగ్గించటం, రద్దీగా ఉండే మార్గాల్లో ఒత్తిడిని తగ్గించటం, ఆధునిక రైళ్లు, పునరాభివృద్ధి చేసిన స్టేషన్ల ద్వారా ప్రయాణికులకు మెరుగైన అనుభూతిని అందించడమే లక్ష్యంగా ఈ నిరంతర పెట్టుబడులు కొనసాగుతున్నాయి.

దీర్ఘకాలిక ప్రణాళికలో భాగంగా, పర్యావరణహితమైన ప్రయాణ వ్యవస్థలను ప్రోత్సహించేందుకు ఏడు నగరాల మధ్య హైస్పీడ్ రైల్ కారిడార్లను 'గ్రోత్ కనెక్టర్స్'గా అభివృద్ధి చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ కారిడార్లలో ముంబై-పూణె, పూణె-హైదరాబాద్, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-చెన్నై, చెన్నై- బెంగళూరు, ఢిల్లీ-వారణాసి, వారణాసి-సిలిగురి ఉన్నాయి. ఈ కారిడార్ల ద్వారా నగరాల మధ్య ప్రయాణ సమయం తగ్గటమే కాక, ప్రయాణికులు ఒక రవాణా మార్గం నుంచి మరో రవాణా మార్గానికి సులభంగా మారేందుకు దోహదపడతాయి.

కొత్త కారిడార్ల ప్రకటనతో రైలు రవాణా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు రానున్నాయి. దక్షిణ భారతదేశంలో చెన్నై-బెంగళూరు-హైదరాబాద్ హైస్పీడ్ వ్యవస్థ సౌత్ హైస్పీడ్ త్రిభుజం (లేదా డైమండ్)లా ఏర్పడి ప్రధాన ఆర్థిక, ఐటీ కేంద్రాలను అనుసంధానిస్తుంది. దీని ద్వారా ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుందని కేంద్ర రైల్వే, సమాచార, ప్రసార, ఎలక్ట్రానిక్, ఐటీ శాఖ మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్ ఇవాళ రైల్ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

చెన్నై-బెంగళూరు మధ్య ప్రయాణ సమయం సుమారు ఒక గంట 13 నిమిషాలు, బెంగళూరు-హైదరాబాద్ మధ్య 2 గంటలు, చెన్నై-హైదరాబాద్ మధ్య ప్రయాణ సమయం 2 గంటల 55 నిమిషాలకు మాత్రమే పరిమితమవుతుందని కేంద్ర మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాలకు ఈ రవాణా వ్యవస్థ అభివృద్ధి ఉత్ప్రేరకంలా మారటమే కాక, ఆయా ప్రాంతాల అభివృద్ధిని వేగవంతం చేస్తుంది.

ముంబై-పూణె హైస్పీడ్ కారిడార్ ద్వారా పశ్చిమ, మధ్య భారతదేశానికి ప్రయాణ సమయం సుమారు 48 నిమిషాలు తగ్గటమే కాక, రెండు ప్రధాన నగరాలను సమర్థవంతంగా అనుసంధానిస్తుంది. పూణె-హైదరాబాద్ కారిడార్ ద్వారా సుమారు ఒక గంట 55 నిమిషాల ప్రయాణ సమయం తగ్గుతుంది. దీన్ని దక్షిణ భారత నగరాలతో అనుసంధానించటం ద్వారా దేశవ్యాప్తంగా హైస్పీడ్ స్పైన్ ఏర్పడి, ప్రయాణికులకు, ఆయా ప్రాంతాల ఆర్థిక వ్యవస్థలకు ప్రయోజనం చేకూరుస్తుంది.

ఉత్తర, తూర్పు భారతదేశంలో ఢిల్లీ-వారణాసి హైస్పీడ్ కారిడార్ ద్వారా సుమారు 3 గంటల 50 నిమిషాలకు ప్రయాణ సమయం తగ్గుతుంది. వారణాసి, పాట్నా మీదుగా పశ్చిమబెంగాల్‌లోని సిలిగురి వరకు నిర్మించే హైస్పీడ్ కారిడార్ ద్వారా వారణాసి-సిలిగురి మధ్య ప్రయాణం కేవలం 2 గంటల 55 నిమిషాల్లోనే పూర్తవుతుంది. దీనిద్వారా ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమబెంగాల్‌ను కలుపుతూ నూతన ఆర్థిక కారిడార్ ఏర్పడటమే కాక, ఆయా ప్రాంతాల అభివృద్ధిని, ఆర్థిక కార్యకలాపాలను వేగవంతం చేస్తుంది.

సుమారు 4,000 కి.మీ మేర విస్తరించనున్న హైస్పీడ్ రైల్ కారిడార్ల ద్వారా రూ.16 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని, తద్వారా భవిష్యత్ రవాణా వ్యవస్థలో రైల్వే రంగం ప్రధానంగా నిలుస్తుందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు.

సరుకు రవాణా, లాజిస్టిక్స్ సామర్థ్యాన్ని భారీగా పెంచే దిశగా కేంద్ర బడ్జెట్‌లో కీలక ప్రతిపాదన చేశారు. పశ్చిమబెంగాల్‌లోని దంకుని నుంచి గుజరాత్‌లోని సూరత్ వరకు.. ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర మీదుగా నూతన డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్‌ను ప్రతిపాదించారు. 2,052 కి.మీ పొడవున్న ఈ కారిడార్ ను ప్రస్తుత వెస్టర్న్ డెడికేటెట్ ఫ్రైట్ కారిడార్‌తో అనుసంధానిస్తారు. దీనివల్ల పశ్చిమ తీరంలోని ఓడరేవులకు సరుకు రవాణా సాఫీగా సాగుతుంది. ప్రస్తుతమున్న తూర్పు, పశ్చిమ డీఎఫ్‌సీలు పూర్తి సామర్థ్యం మేరకు పనిచేస్తున్నట్లు కేంద్రమంత్రి ప్రకటించారు. ఈ కారిడార్లో రోజూ సుమారు 400 సరుకు రవాణా రైళ్లు నడుస్తున్నాయి. భవిష్యత్తులో పెరగబోయే డిమాండ్ ను తట్టుకోవటానికి అదనపు కారిడార్ల నిర్మాణం అవసరమని ఆయన పేర్కొన్నారు.

తూర్పు-పశ్చిమ కారిడార్, వివిధ ప్రాంతాల మధ్య వాణిజ్య ప్రవాహాన్ని బలోపేతం చేస్తుంది. ప్రస్తుతమున్న రైల్వే వ్యవస్థలో రద్దీని తగ్గించటమే కాక, సరుకు రవాణా సామర్థ్యాన్ని పెంచటం ద్వారా పారిశ్రామిక వృద్ధికి, సరఫరా వ్యవస్థలకు మద్దతుగా నిలుస్తుంది.

భద్రతకు తొలి ప్రాధాన్యతనిస్తూ దాదాపు రూ.1.20 లక్షల కోట్లను ప్రత్యేకంగా భద్రతా పనులకు కేటాయించినట్లు కేంద్రమంత్రి స్పష్టం చేశారు. కొన్నేళ్లుగా నిరంతరాయంగా పెట్టిన పెట్టుబడులు ఇప్పటికే ఆశించిన ఫలితాలను ఇచ్చాయని, దీనివల్ల రైల్వే ప్రమాదాలు దాదాపు 95 శాతం తగ్గినట్లు కేంద్రమంత్రి వెల్లడించారు. రైల్వే రంగంలో భద్రతను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా రైలు పట్టాలు, ఇంజిన్లు, గూడ్స్ వ్యాగన్లు, పాసింజర్ కోచ్‌ల నిర్వహణను మెరుగుపరచటం, కవచ్ స్వదేశీ ఆటోమేటిక్ ట్రైన్ ప్రొటెక్షన్ సిస్టమ్ ను అందు బాటులోకి తీసుకురావటం, సీసీటీవీ కెమెరాల ఏర్పాటు, ఓవర్ హెడ్ ఎలక్ట్రికల్ (ఓహెచ్ఈ) వ్యవస్థల ఆధునీకరణ, రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేయటం, వినియోగదారులకు సేవలను మెరుగుపరచటం, ప్రయాణికులకు అవసరమైన వసతుల కల్పన వంటి అంశాలపై దృష్టి సారించనున్నారు.

రైల్వే సాంకేతికతలో ప్రొపల్షన్ వ్యవస్థలు అత్యంత కీలకమని, భారతదేశంలో రూపొందించి, తయారుచేసిన అత్యాధునిక ప్రొపల్షన్ వ్యవస్థలను అమెరికా, స్విట్జర్లాండ్, జర్మనీ, ఫ్రాన్స్, స్పెయిన్ వంటి ప్రపంచ అగ్రదేశాలకు ఎగుమతి చేస్తున్నట్లు కేంద్రమంత్రి వెల్లడించారు.

మౌలిక సదుపాయాల కల్పన రికార్డు స్థాయి విజయాలను కేంద్రమంత్రి ప్రస్తావిస్తూ.. 35,000 కి.మీ కొత్త రైల్వే ట్రాక్‌ల నిర్మాణం, 47,000 కి.మీ మేర రైల్వే విద్యుద్దీకరణ చేసినట్లు చెప్పారు. బ్రాడ్ గేజ్ నెట్‌వర్క్‌లో 99.5 శాతానికి పైగా విద్యుద్దీకరణ పూర్తయినట్లు తెలిపారు. వీటితో పాటు వందేభారత్ స్లీపర్, చైర్ కార్ రైళ్లు, అమృత్ భారత్, నమో భారత్ రైళ్ల తయారీతో పాటు రికార్డు స్థాయిలో కొత్త వ్యాగన్లను చేర్చటం వంటివి వేగంగా జరుగుతున్నాయన్నారు.

రోడ్డు రవాణాతో పోలిస్తే రైలు రవాణా ద్వారా సుమారు 95 శాతం తక్కువగా కాలుష్యం జరుగుతుందని శ్రీ అశ్వినీ వైష్ణవ్ అన్నారు. ఇది పర్యావరణం, వాతావరణం పట్ల ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ఉండటమే కాక, రైల్వేలను పర్యావరణహిత ప్రజా రవాణా వ్యవస్థగా మార్చాలన్న ప్రధానమంత్రి దార్శనికతను ప్రతిబింబిస్తుందని తెలిపారు.

దేశాభివృద్ధికి, ఆర్థిక వృద్ధికి, సమ్మిళిత అనుసంధానానికి భారత రైల్వే కీలక ఆధారమని కేంద్ర బడ్జెట్ 2026-27లో కేటాయించిన రికార్డు స్థాయి నిధులు తెలియజేశాయి. ఈ బడ్జెట్‌లో ప్రకటించిన కార్యక్రమాల ద్వారా వేగవంతమైన కనెక్టివిటీ, సమర్థవంతమైన లాజిస్టిక్స్, పటిష్ఠమైన మౌలిక సదుపాయాలను అందిస్తూ, వికసిత్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా దేశ నిర్మాణంలో భారత రైల్వే కీలక పాత్ర పోషిస్తుంది.

# ధనార్జన కోసమే రాయలసీమ లిఫ్టు

**–రూ 1000 కోట్లు వైసిపి నేతల జేబుల్లోకి వెళ్లాయి**

**–వైసీపీవి డైవర్షన్ పాలిటిక్స్**

**–రాయలసీమ అభివృద్ధి కూటమి ప్రభుత్వ లక్ష్యం**

**–నంద్యాల జిల్లా అధ్యక్షురాలు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య**



జూపాడు ఫిబ్రవరి 3: గత వైసీపీ ప్రభుత్వంలో ధనార్జన కోసమే రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును చేపట్టారని నంద్యాల జిల్లా టిడిపి అధ్యక్షురాలు, పాణ్యం ఎమ్మెల్యే గౌరవ చరిత రెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య విమర్శించారు. పోతిరెడ్డిపాడు వద్ద చేపట్టిన రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును టిడిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి మంగళవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయలసీమ ప్రాజెక్టు మట్టి వర్కులు మాత్రమే పూర్తి చేశారని, రూ. 1000 కోట్ల రూపాయలు వైసీపీ నేతల జేబులోకి వెళ్లాయని ఆరోపించారు. 2021 లోనే రాయలసీమ ప్రాజెక్టు పనులు నిలిచిపోయాయని తెలిపారు.

ప్రాజెక్టు నిలిచాక మూడేళ్ల పాటు వైసిపి ప్రభుత్వం ఉన్న కోర్టులో వాదించలేకపోయారని, రో 2.6 కోట్లు జరిమానా కూడా విధించడం జరిగిందని తెలిపారు. వైసిపివి డైవర్షన్ పాలిటిక్స్ అని, తిరుమల లడ్డులో కల్తీ నెయ్యి సంఘటనలను పక్కదారి పట్టించేందుకే పోతిరెడ్డిపాడు పద్ద ధర్నా చేసేందుకు సిద్ధమయ్యారు అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఇరిగేషన్ ప్రాజెక్టులకు పైసా కూడా నిధులు ఇవ్వలేదని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రాజెక్టులకు నిధులు విడుదల చేస్తా పనులు పూర్తి చేయడం జరుగుతుందన్నారు.

రాయలసీమ అభివృద్ధి కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. కేశికిరణ్ కు రెండు పంటలకు నిరందిస్తామని తెలిపారు. అందరినీ వా ద్వారా 2000 కి చెక్కల నుంచి 3850 కాల్వ సామర్థ్యాన్ని పెంచడం జరిగిందని, కేవలం 100 రోజుల్లోనే 785 కిలోమీటర్ల మేర పనులు చేయడం జరిగిందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో అన్నమయ్య డ్యామ్ కొట్టుకుపోయి నల్ల ఏ మంది చనిపోతే అప్పటి ముఖ్యమంత్రి పరామర్శించేందుకు కూడా వెళ్లలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక తుంగభద్ర డ్యామ్ గేట్ కొట్టుకుపోతే ఐదు రోజుల్లోనే మరమ్మత్తులు చేయించడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడి తుంగభద్ర గేట్లో అమర్చేందుకు ఇరువు 55 కోట్లు విడుదల చేయించడం జరిగిందని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం లో అలగనూరు రిజర్వాయర్ కట్ట కుంగిపోతే పనులు చేపట్టలేదన్నారు. అప్పట్లో రూపాయి 3 కోట్లతో పూర్తయ్యే పనులు ప్రస్తుతం 36 కోట్లకు చేరాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల కోసం రైతుల అభివృద్ధి కోసం కూడా ప్రభుత్వం పనిచేస్తుందని, రైతులకు రెండు పంటలకు నీరు ఇచ్చి ఆదుకుంటుందని ఎమ్మెలు గౌరు చరిత గిత్త జయసూర్య తెలిపారు.

ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ మోహన్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షురాలు ప్రసన్నలక్ష్మి, నాయకులు గిరీశ్వర్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి, శ్రీనివాసులు, రమణారెడ్డి, పెద్దన్న, పాల్గొన్నారు.

# అమెరికా వాణిజ్య ఒప్పందం ప్రపంచ ఆర్థిక స్థిరత్వానికి ఒక చారిత్రక మైలురాయి: చంద్రబాబు

అమరావతి ఫిబ్రవరి 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: అమెరికా వాణిజ్య ఒప్పందం ప్రపంచ ఆర్థిక స్థిరత్వానికి ఒక చారిత్రక మైలురాయి అని ఏపి సిఎం చంద్రబాబు నాయుడు కొనియాడారు. అమెరికాతో చారిత్రక ఒప్పందం ద్వారా దేశ యువత, రైతులకు అపారమైన అవకావశాలు లభిస్తాయని అన్నారు. ఒప్పందం విజయవంతంగా పూర్తి చేసిన ప్రధాని నరేంద్రమోడీకి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అమెరికా 18 శాతం సుంకాల తగ్గింపు వల్ల..రెండు గొప్ప ప్రజాస్వామ్య దేశాల మధ్య బంధం మరింత బలోపేతమవుతుందని ఆనందాన్ని వ్యక్తం చేశారు. నిరంతర గ్లోబల్ వృద్ధికి దోహదపడే దూరదృష్టి నిర్ణయమిదని, ప్రధాని నాయకత్వంలో భారత్ ఒక గ్లోబల్ ఆర్థిక శక్తిగా మరింత పటిష్టం కానుందని జోష్యం చెప్పారు. భారత ఎగుమతుల పోటీ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుతుందని, మోడీ నాయకత్వంలో ఆర్థికశక్తి కేంద్రంగా భారత్ ఉందని చంద్రబాబు పేర్కొన్నారు

# తల్లికి ఉన్న వైకల్యం వల్ల తనకు వివాహం జరగడం లేదని హుస్సేన్ సాగర్‌లో దూకి యువతి ఆత్మహత్య

హైదరాబాద్ ఫిబ్రవరి 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: మేడ్చల్ జిల్లా లో దారుణం చోటు చేసుకుంది. తల్లికి ఉన్న వైకల్యం వల్ల తనకు వివాహం జరగడం లేదని హుస్సేన్ సాగర్‌లో దూకి యువతి ఆత్మహత్య చేసుకుంది. ఆదివారం రాత్రి నీటిపై తేలుతూ లభ్యమైన మృతదేహం లభ్యమైంది. కండ్లకోయకు చెందిన తోష్నీవాల్ విజయలక్ష్మి(26)కూకట్ పల్లి పరిధిలోని మైత్రి నగర్‌లో మతిస్థిమితం సరిగ్గా లేని తన తల్లితో ఉంటూ ఐటీ సంస్థలో ఉద్యోగం చేస్తుంది. ఇటీవల వివాహ సంబంధాలు రాగా.. మతిస్థిమితం లేని తన తల్లి తనతో పాటే ఉంటుందని విజయలక్ష్మి నిబంధన పెట్టడంతో పెళ్లికి నిరాకరిస్తున్నారు. దీంతో తీవ్ర మనోవేదనకు గురై శనివారం సాయంత్రం ఇంట్లో నుండి బయటకు వెళ్లి ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది.

# జనగామ జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా పేరిట ఫేక్ ఐడెంటిటీ

**-వాట్సాప్, ఫేస్ బుక్ సామాజిక మాధ్యమాల ద్వారా ఇతరులకు సందేశాలు**

జనగామ, ఫిబ్రవరి 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : సైబర్ నేరగాళు తాజాగా జనగామ జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా పేరిట ఫేక్ ఐడెంటిటీ సృష్టించి వాట్సాప్, ఫేస్ బుక్ సామాజిక మాధ్యమాల ద్వారా ఇతరులకు సందేశాలు పంపుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా వెంటనే అప్రమత్తమయ్యారు.సోషల్ మీడియాలో తన పేరిట ఫేక్ ఐడెంటిటీ ప్రొఫైల్ క్రియేట్ చేసిన సైబర్ నేరగాళ్లపై సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదేవిధంగా ఫేక్ ఐడెంటిటీ ప్రొఫైల్ వాట్సాప్, ఫేస్ బుక్ నుంచి తన పేరిట వచ్చే సందేశాలకు ప్రజలు ఎవరు కూడా స్పందించొద్దని కలెక్టర్ సూచించారు. స్థానిక సోషల్ మీడియాలో ఈ విషయం వైరల్ గా మారింది.

# మూడు మున్సిపల్స్‌లో దూసుకుపోతున్న కారు

**-కానరాని కాషాయం.. డిపాజిట్ కూడా గల్లంతే..**

**-ప్రచారానికి కాంగ్రెస్ ప్రాధాన్యం...**

మేడ్చల్, ఫిబ్రవరి 3: మేడ్చల్ నియోజకవర్గంలో మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్



పార్టీ దూసుకుపోతోంది. నియోజకవర్గంలో మూడు చైర్మన్ స్థానాలను కైవసం చేసుకున్నా ఆశ్చర్య పోవాల్సిన అవసరం లేదు.. మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి చాలెంజిగా తీసుకొని ఎల్లంపేట, మూడు చింతలపల్లి, అలియాబాద్ మున్సిపాలిటీల చైర్మన్ లను బిఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకవాలని భారీ ఎత్తున ప్రచార ఆర్భాటాలతో ర్యాలీలు నిర్వహిస్తున్నారు.. అధికార కాంగ్రెస్ కేవలం ప్రచారానికే పరిమితమైంది. కాషాయం పార్టీ పరిస్థితి కూడా అలాగే కనిపిస్తోంది.

మూడింటిని కైవసం చేసుకునే దిశగా భారాస ముందుకు సాగుతోంది. ప్రతి వార్డుకు ఇంచార్జిని ఏర్పాటు చేసి కాంగ్రెస్, బీజేపీ లకు సవాల్ విసురుతున్నారు. ఈ సందర్భంగా చామకూర మల్లారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ తెచ్చిన ఘనత కల్వకుంట్ల చంద్రశేఖర రావుకే దక్కుతుందని తమ విజయాన్ని ఎవరూ ఆపలేరని ధీమా వ్యక్తం చేశారు.తెలంగాణ రాష్ట్రమంతా ఇంటింటికి త్రాగునీరు, అందించిన ఘనత కేసీఆర్ కే దక్కుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ ఎలక్షన్ ఇంచార్జ్ వెంకటరెడ్డి, మేడ్చల్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇన్చార్జి చామకూర మహేందర్ రెడ్డి, మేడ్చల్ గ్రంథాలయ మాజీ చైర్మన్ భాస్కర్ యాదవ్, శ్రీనివాసరెడ్డి, దయానంద్ యాదవ్, భాగ్యరెడ్డి, ఆకిటి నవీన్ రెడ్డి, రఘుపతి రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కాలనీలో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను పరిష్కరిస్తా

**-ఒక్క సారి అవకాశం ఇవ్వండి**

**-34 వ వార్డు బీజేపీ కౌన్సిలర్ అభ్యర్థి గంజి రాజు**


నిర్మల్, ఫిబ్రవరి 3: ఈనెల 11న జరుగనున్న మున్సిపల్ ఎన్నిక ల్లో ఒక్కసారి



34వ వార్డు కౌన్సిలర్ బీజేపీ పార్టీ అభ్యర్థి గంజి రాజు ఈ రోజు ఇంటింటా ప్రచారం చేపట్టి అవకాశం ఇవ్వాలని ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా గంజి రాజు మాట్లాడు తూ తమకు ఒక్కసారి కౌన్సిలర్ గా అవకాశం కల్పిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని ఓటర్లను ప్రసన్నం చేసుకున్నారు.

34వ వార్డులో దీర్ఘకాలికంగా నెలకొన్న సమస్యలన్నింటిని మూడు నెల ల్లోనే తెలుసుకుని దశల వారిగా సమస్యలను పరిష్కరించి మీముందుకు వస్తామని ఓటర్లకు భరోసా కల్పించారు. ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి సహకారంతో ప్రత్యేకంగా నిధులు తెచ్చేందుకు కృషి చేస్తానని ప్రజలకు భరోసా కల్పించారు. ప్రత్యేక నిధులు తీసుకువచ్చి వార్డు అభివృద్ధికి దోహదపడుతామన్నారు.

వార్డులో నెలకొన్న సమస్య లు ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే వాటిని వెనువెంటనే పరిష్కరించేందుకు పెద్దల సహకారంతో పరిష్కరిస్తామన్నారు. వార్డు ప్రజలు వారికి బ్రహ్మరథం పట్టారు. ఆయన వెంట కాలనీవాసులు, బీజేపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# నెల రోజుల పాటు చక్కెర తినడం మానేసి చూడండి...



హైదరాబాద్ ఫిబ్రవరి 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); మనం తీసుకునే ఆహారంలో చక్కెర ఒక భాగమైనదని చెప్పవచ్చు. ఉదయం నిద్రలేచింది మొదలు సాయంత్రం నిద్రించే వరకు ఏదో ఒక రూపంలో చక్కెరను తీసుకుంటూనే ఉంటాం. టీ, కాఫీ, జ్యూస్, స్వీట్స్, కుక్కీస్ ఇలా ఏదో ఒక రూపంలో చక్కెర మన శరీరంలోకి వెళ్తూనే ఉంటుంది. అయితే చక్కెరను తీసుకోవడం 30 రోజుల పాటు మానేయడం వల్ల మనం అనేక శారీరక, మానసిక మార్పులను గమనించవచ్చని వైద్యులు చెబుతున్నారు. అయితే చక్కెరను మానేసిన తరువాత మొదట్లో మనం కొన్ని ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుంది. చక్కెరను తీసుకోవడం మానేసిన తరువాత చిరాకు, అలసట, ఆందోళన వంటి ఇబ్బందులు తలెత్తుతాయి. మెదడు చక్కెర అందించే డోపమైన్ హిట్ ను కోల్పోవడం వల్ల ఇలా జరుగుతుంది. చక్కెర తీసుకోవాలనే కోరిక ఎక్కువగా ఉంటుంది. శరీరం నెమ్మదిగా చక్కెరకు దూరం అయ్యే కొద్దీ ఈ కోరికలు తగ్గుతూ వస్తాయి.

**కొవ్వు కరుగుతుంది..**

అయితే డిటాక్స్ ట్రెండ్ కంటే ఎక్కువగా చక్కెరను తీసుకోకపోవడం వల్ల మన శరీరానికి కలిగే మేలే ఎక్కువగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ఇలా చక్కెరను తీసుకోవడం తగ్గించడం వల్ల క్రమంగా రెండవ వారం నాటికి రక్తంలో చక్కెర స్థాయిలు తగ్గుతాయి. ఇన్సులిన్ సెన్సిటివిటీ మెరుగుపడుతుంది. రక్తంలో గ్లూకోజ్ మరింత సమర్థవంతంగా నిర్వహించబడుతుంది. ఇన్సులిన్ స్థాయిలు తగ్గడంతో శరీరం నిల్వ ఉన్న కొవ్వును కరిగించడం ప్రారంభిస్తుంది. తద్వారా శరీర బరువు తగ్గుతుంది. ఇక మూడవ వారం కూడా చక్కెరను తీసుకోవడం మానేయడం వల్ల మనం దీర్ఘకాలిక ప్రయోజనాలనుగమనించవచ్చు. చర్మ ఆరోగ్యం మెరుగుపడుతుంది. దద్దుర్లు, మంట, మొటిమలు, పగుళ్లు వంటివి తగ్గుతాయి. అకాల వృద్ధాప్యం రాకుండా ఉంటుంది. రక్తంలో చక్కెర క్రాష్ లు తగ్గడం వల్ల మనం మరింత స్థిరంగా దృష్టి కేంద్రీకరించవచ్చు.

**కొలెస్ట్రాల్ అదుపులో..**

క్యాలరీలు తీసుకోవడం తగ్గడం వల్ల శరీర బరువు తగ్గడాన్ని మనం ఎక్కువగా గమనించవచ్చు. అంతేకాకుండా అధిక కొలెస్ట్రాల్, ఫ్యాటీ లివర్ వంటి కాలేయ వ్యాధులు, అధిక రక్తపోటు, మధుమేహం వంటి ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం కూడా తగ్గుతుందని వైద్యులు తెలియజేస్తున్నారు. ఇక చక్కెర ఉండే స్వీట్లు, పానీయాలు, బేక్ చేసిన వస్తువులు తీసుకోవడం తగ్గించడం వల్ల ప్రజలు పండ్లు, గింజలు వంటి వాటిని తీసుకోవడానికి మొగ్గు చూపుతారు. దీంతో శరీరానికి కావల్సిన పోషకాలు, విటమిన్లు, ఖనిజాలు లభిస్తాయి. చక్కెర కలిగిన ఆహార పదార్థాలకు బదులుగా నానబెట్టిన ఖర్జూరాలు, పెరుగు వంటి వాటిని తీసుకోవడం వల్ల బరువు అదుపులో ఉంటుంది. పేగు ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది.

అంతేకాకుండా చక్కెరలో వచ్చే హెచ్చుతగ్గులు బద్ధకం, చిరాకుకు కారణమవుతాయి. కనుక చక్కెరను మానేయడం వల్ల మనం ఉత్సాహంగా ఉండడంతో పాటు మానసికంగా ఉత్సాహంగా ఉండవచ్చు. ఇలా నెలరోజుల పాటు చక్కెర తీసుకోవడం మానేయడం వల్ల మన ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందని వైద్యులు చెబుతున్నారు. చక్కెర మానేయడం తాత్కాలికంగానే కాకుండా స్థిరమైన జీవనశైలి ఎంపికగాఉండాలని వారు సూచిస్తున్నారు. చక్కెరకు బదులుగా బెల్లం, తేనె, ఖర్జూరం వంటి వాటిని మితంగా తీసుకోవాలి. అలాగే తీపి వంటకాల తయారీలో చక్కెరకు బదులుగా యాలకులు, దాల్చిన చెక్క వంటి వాటిని వాడడం వల్ల తీపి తింటున్నామన్న అనుభూతి పెరుగుతుందని వైద్యులు సూచిస్తున్నారు.

# ఉదయం ఖాళీ కడుపుతో అరటి పండును తినవచ్చా..?



హైదరాబాద్ ఫిబ్రవరి 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); అత్యంత పోషకమైన, శక్తితో నిండిన ఆహారాల్లో అరటిపండు ఒకటి. అరటిపండు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. దీనిని తీసుకోవడం వల్ల మనం అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. దీనిలో పొటాషియం, విటమిన్ బి6, మెగ్నీషియం వంటి ఎన్నో పోషకాలు ఉంటాయి. శక్తిని అందించడంలో, జీర్ణవ్యవస్థను మెరుగుపరచడంలో, రక్తపోటును తగ్గించడంలో ఇలా అనేక రకాలుగా అరటిపండు మనకు సహాయపడుతుంది. ఉదయం పూట ఆహారంలో భాగంగా కొందరు పండ్లను తీసుకుంటూ ఉంటారు. అందులో భాగంగా ఉదయం ఖాళీ కడుపుతో అరటిపండును తీసుకోవచ్చా లేదా అన్న సందేహం కలుగుతూ ఉంటుంది. అసలు ఖాళీ కడుపుతో అరటిపండును తీసుకోవచ్చా లేదా, ఖాళీ కడుపుతో అరటిపండును తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు, దుష్ప్రభావాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

**రక్త పోటు అదుపులో..**

ఉదయం మేల్కొన్న తరువాత శరీరం రోజును ప్రారంభించడానికి సిద్దంగా ఉంటుంది. రోజును ప్రారంభించే ముందు ఉదయం పూట మనం తీసుకునే ఆహార విషయంలో జాగ్రత్తలు పాటించడం అవసరం. ఖాళీ కడుపుతో తీసుకునే ఆహారం మన శక్తి స్థాయిలను, మన శరీర జీవక్రియలను గణనీయంగా ప్రభావితం చేస్తుంది. అలాగేరాత్రంతా ఉపవాసం ఉన్న తరువాత శరీరానికి శక్తిని అందించడానికి, హైడ్రేట్ చేయడానికి పోషకాలు చాలా అవసరం. కనుక ఉదయం మనం తీసుకునే ఆహారం ఆకలిని తీర్చడంతో పాటుగా జీవక్రియలను మెరుగుపరిచేదిగా, శక్తిని అందించేదిగా ఉండాలి. కనుక ఉదయం పూట అరటిపండ్లను తీసుకోవడం వల్ల ఆకలి తీరడంతో పాటు శరీరానికి కావల్సిన శక్తి, పోషకాలు అన్నీ అందుతాయి. ఖాళీ కడుపున అరటి పండ్లను తీసుకోవడం వల్ల తక్షణ శక్తి లభిస్తుంది. రక్తపోటు స్థాయిలు కూడా అదుపులో ఉంటాయి. ఉదయం ఖాళీ కడుపుతో అరటిపండును తీసుకోవడం ప్రయోజనకరంగానే ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. అయితే ప్రయోజనాలతో పాటు కొన్ని దుష్ప్రభావాలు కూడా ఉంటాయని వారు తెలియజేస్తున్నారు.

**అందరికీ సరిపోదు..**

ఖాళీ కడుపుతో అరటిపండును ఉదయం పూట తీసుకోవడం అందరికి సరిపోదని వారు సూచిస్తున్నారు. అరటిపండ్లను ఖాళీ కడుపుతో తీసుకోవడం వల్ల శరీరం ఇనుమును గ్రహించే సామర్థ్యం తగ్గుతుంది. దీంతో శరీరం మొత్తం శక్తి స్థాయిలు కూడా తగ్గుతాయి. రోగనిరోధక శక్తి కూడా తగ్గుతుంది. అలాగే అరటిపండులో క్యాలరీలు తక్కువగా ఉన్నప్పటికీ దీనిని తిన్న కొన్ని నిమిషాలకే ఆకలి పెరుగుతుంది. దీని వల్ల మనం అతిగా తినే అవకాశం కూడా ఉంది. తద్వారా శరీర బరువు కూడా పెరుగుతుందని వైద్యులు చెబుతున్నారు. అంతేకాకుండా అరటిపండులో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది కనుక ఇది కొందరిలో కడుపు నొప్పికి కారణమవుతుంది. ఫైబర్ సాధారణ మోతాదులో తీసుకోవడం వల్ల ప్రయోజనకరంగా ఉంటుంది. కానీ ఖాళీ కడుపుతో తీసుకునే ఫైబర్ కొందరిలో కడుపులో చికాకు, ఉబ్బరం గ్యాస్ వంటి సమస్యలను కూడా కలిగిస్తుంది. కనుక సున్నితమైన జీర్ణాశయం ఉన్న వారు ఖాళీ కడుపుతో అరటిపండును తీసుకోకపోవడమే మంచిది.

ఈ విధంగా ఉదయం పూట ఖాళీ కడుపుతో అరటిపండును తీసుకోవడం వల్ల మనకు ప్రయోజనాలతో పాటు దుష్ప్రభావాలు కూడా ఉంటాయని ఖాళీ కడుపుతో అరటిపండును తీసుకోవాలా వద్దా అనే అంశాన్ని మన శరీరాన్ని బట్టి మనమే నిర్ణయించుకోవాలని వైద్యులు తెలియజేస్తున్నారు.

# రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి..

## -జిల్లా కలెక్టర్ కె. హరిత

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 3: ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య



సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించి ఆసుపత్రిలోని వివిధ వార్డులు, పలు విభాగాలను పరిశీలించి, చికిత్స పొందుతున్న రోగులను వైద్య సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

రక్త నిల్వ గదిని పరిశీలించి వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై విచారించి వైద్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చేవారిలో సామాన్యులు, ఆదివాసి గిరిజనులు ఎక్కువగా ఉంటారని, వారి పట్ల మర్యాదగా వ్యవహరించాలని తెలిపారు.

వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, నిర్లక్ష్యం వహించకూడదని తెలిపారు. ఆసుపత్రిలోని వార్డులు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, రోగులకు అందించే భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని తెలిపారు. రోగుల ఆరోగ్య స్థితిగతులపై వైద్యులు, సిబ్బంది ఎల్లప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి పర్యవేక్షకులు ప్రవీణ్, వైద్య కళాశాల ప్రిన్సిపల్ సుబోద్ కుమార్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఈ నెల 5 నుండి సీఎం కప్ క్రీడా పోటీలు

జుక్కల్, ఫిబ్రవరి 3: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ స్థాయిలో క్రీడాకారులను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో సీఎం కప్-2025 క్రీడా పోటీలను నిర్వహించడం జరుగుతుంది. జుక్కల్ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఇప్పటికే క్రీడా పోటీలు నిర్వహించి, ప్రతిభావంతులైన క్రీడాకారులకు నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరిగింది. ఇది ఇలాఉండగా జుక్కల్ నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు జుక్కల్ లో ఈనెల 5 నుండి 7వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్టు జుక్కల్ మండల విద్యాశాఖఅధికారి తిరుపతయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 5న జుక్కల్ జిల్లాపరిషత్ హైస్కూల్లో వాలీబాల్ పోటీలు నిర్వహించడం జరుగుతుందని, దీంతో పాటు ఈనెల 6న కూడా జుక్కల్ హైస్కూల్లోనే కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహిసున్నామని, అథ్లెటిక్స్ పోటీలు మాత్రం జుక్కల్ మండలంలోని పెద్ద ఎడ్గి హైస్కూల్ ప్రాంగణంలో ఈనెల 7న నిర్వహించటం జరుగుతుందని, ఈపోటీలన్నీ ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయని ఎంఈఓ తిరుపతయ్య తెలిపారు. ఈనియోజకవర్గ స్థాయిపోటీలలో జుక్కల్ నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలకు చెందిన ఎంపిక చేసిన క్రీడాకారులు పాల్గొనడం జరుగుతుందని ఆయన తెలిపారు.

# సమ్మక్క సారలమ్మ జాతర నిర్వహణలో ప్రభుత్వం విఫలం

## -సమ్మక్క సారలమ్మ జాతరకు వచ్చిన భక్తులకు ప్రభుత్వం బహిరంగ క్షమాపణ చెప్పాలి

## -శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనా చారి డిమాండ్

హైదరాబాద్ ఫిబ్రవరి 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ):సమ్మక్క సారలమ్మ జాతర నిర్వహణలో రేవంత్ ప్రభుత్వం ఘోరంగా విఫలమయ్యిందని.. జాతర నిర్వహణకు శాశ్వత ఏర్పాట్లు చేస్తామని సీఎం, మంత్రులు ఉత్తర కుమార ప్రగాల్భాలు పలికారు. 15 గంటల పాటు ట్రాఫిక్ జామ్ అయ్యింది. కనీస ఏర్పాట్లు చేయలేకపోయారన్నారు మధుసూదనా చారి. ఇదొక్క వైఫల్యం చాలు రేవంత్ ప్రభు త్వం ఎట్లా పనిచేస్తోందో చెప్పడా నికి. కేసీఆర్ హయాంలో సమ్మక్క సారలమ్మ జాతర ఘనంగా జరిగింది. మాటలు తప్ప ఈ ప్రభుత్వంలో చేతలు లేవు. సమ్మక్క సారలమ్మ జాతరకు వచ్చిన భక్తులకు ప్రభుత్వం బహిరంగ క్షమాపణ చెప్పాలని మధుసూదనా చారి డిమాండ్ చేశారు. నిన్న కేసీఆర్‌ను ఉద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి చేసిన వెకిలి మాటలను తీవ్రంగా ఖండిస్తు న్నామని శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనా చారి అన్నారు. రేవంత్ మాటలు సిట్ విచారణను ప్రభావితం చేసేలా ఉన్నాయి. కేసీఆర్ ఏనాడు కూడా విచారణను ఎదుర్కోను అని అనలేదు ..మున్సిపల్ ఎన్నికలు ఉన్నందున మొదటి నోటీసు విచారణకు టైమ్ కోరారు. ఎన్నో విచారణలను రెండేళ్లలో ఎదుర్కొన్నాం. దేనికి భయపడ మన్నారు.కేసీఆర్ ముమ్మాటికీ జాతిపితే.. తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చిన చరిత్ర కేసీఆర్‌దన్నారు. కేసీఆర్ తెలంగాణ ప్రజల గుండెల్లో చిర స్థాయిగా ఉంటారు. తెలంగాణ ఉద్యమంలో రేవంత్ రెడ్డిది చీమ కాలంత ప్రమేయం కూడా లేదు. నిన్న జస్టిస్ సుదర్శన్ రెడ్డి విద్వేష పూరిత ప్రసంగాలు వద్దని సూచించినా దాన్ని పెడచెవిన పెట్టి రేవంత్ కేసీఆర్‌పై దిగజారుడు వ్యాఖ్యలు చేశారని సిరికొండ మధుసూదనా చారి అన్నారు.రేవంత్ ది కుక్క తోక వంకర అనే బుద్ధి. హార్వర్డ్ వెళ్లినా అంతరిక్షం వెళ్లినా రేవంత్ బుద్ధి మారదు. గ్యారంటీల అమలు వదిలి గారడీ ప్రభుత్వాన్ని నడుపుతున్నాడు కేసీఆర్ పదవులకు రాజీనామా చేసి సొంతగా పార్టీ పెట్టి తెలంగాణ సాధించారు రేవంత్ తన చిల్లర బుద్ధిని చాటుకుంటూ కేసీఆర్‌పై అదే పనిగా పిచ్చి విమర్శలు చేస్తున్నారు. రేవంత్ విమర్శలను తెలంగాణ సమాజం గమనిస్తోంది. తగిన బుద్ధిచెబ ుతుందన్నారు మధుసూదనా చారి.

# ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల సంగతి దేవుడెరుగు.. ఉన్న గురుకులాల పరిస్థితి అధ్వాన్నం చేశారు

## -మాజీ మంత్రి హరీష్ రావు ఆగ్రహం

హైదరాబాద్ ఫిబ్రవరి 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్);ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల సంగతి దేవుడెరుగు.. ఉన్న గురుకులాల పరిస్థితి అధ్వాన్నం చేశారని మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపించారు. పాము కాటుకు గురై ఆస్పత్రిలో చేరిన గురుకుల విద్యార్థిని ప్రాణానికి పూర్తి బాధ్యత సీఎం రేవంత్ రెడ్డిదేనని అన్నారు. మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి గురుకులంలో ఇంటర్ విద్యార్థిని అశ్మిత పాముకాటుకు గురై మృత్యువుతో పోరాడుతుందన్న ఘటనపై ఎక్స్ వేదికగా స్పందించారు. విద్యార్థిని పాము కాటుకు గురైన వార్త తనను ఎంతో కలిచివేస్తోందన్నారు. రేవంత్ రెడ్డి గారు మీ పాలనలో గురుకులాలు విద్యా నిలయాలా..? లేదంటే విషసర్పాలకు ఆవాసాలా.. అని హరీష్ రావు ప్రశ్నించారు.సీఎంగా, విద్యాశాఖ మంత్రిగా ఇది మీ పరిపాలనా వైఫల్యం కాదా?? రూ.20 వేల కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ అని చెబుతూ రంగుల లోకం చూపిస్తూ గురుకులాలను మీరు గాలికి వదిలేయడం సిగ్గుచేటన్నారు. గురుకులాల్లో పిచ్చి మొక్కలు తొలగించే దిక్కులేదు. చిమ్మచీకట్లో లైట్లు వేసే నాథుడు లేడు. అపరిశుభ్రత కారణంగా గురుకులాల్లో నేడు కుక్కకాట్లు, పాము కాట్లు సర్వసాధారణంగా మారిపోవడం అత్యంత దుర్మార్గమైన విషయమన్నారు.గురుకుల బిడ్డలకు కడుపునిండా తిండి లేదు.. ప్రాణాలకు రక్షణ లేదన్నారు. సీఎం హార్వర్డ్ యూనివర్సిటీకి వెళ్లి విదేశాల్లో ఫొటోలకు పోజులిస్తే ఇక్కడ పేద విద్యార్థులు ఆస్పత్రి పాలై కొట్టుమిట్టాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

తమ పిల్లలు చదువుకోవడానికి వెళ్తున్నారా..? లేక చావుతో పోరాడేందుకు వెళున్నారా.. అని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా మొద్దు నిద్ర వీడి పతనమవుతున్న గురుకులాలను కాపాడాలి. రాజకీయ కక్షసాధింపుల మీదున్న శ్రద్ధలో కొంతైనా పేద పిల్లల బతుకుపై పెట్టండని విజ్ఞప్తి చేశారు.

# మెదక్ అభ్యర్థుల జాబితా విడుదల..

మెదక్, ఫిబ్రవరి 3: : మెదక్ మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు 31 వార్డులకు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను ఖరారు చేసింది. మంగళవారం మున్సిపల్ ఎన్నికల ఇంచార్జి, మాజీ ఎమ్మెల్సీ ఫారూక్ హుసేన్ పార్టీ అభ్యర్థుల తరపున అధికారులకు బీఫాంలను మున్సిపల్ కార్యాలయంలో అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అన్ని కులాలకు ప్రాధాన్య తనిస్తూ టిక్కెట్లు కేటాయించినట్లు వివరించారు. మున్నూరు కాపు, ముస్లింలకు 4, ముదిరాజ్, ఎస్సీ (మాదిగ) లకు 3, లింగాయత్, గౌడ్స్, వంజరి కులస్తులకు 2 చొప్పున టికెట్లు కేటాయించినట్లు తెలిపారు.

వీరితోపాటు ఎస్సీ (మాల), మూనల, యాదవ్, బుడగ జంగం, ఎరుకల, ఆర్య క్షత్రియ, కుంచెఎరుకల, క్రిస్టియన్, చాకలి, పద్మశాలి,మేర కులస్తులకు ఒకటి చొప్పున టికెట్లు బి ఫామ్ లు అంద జేసినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరేళ్ల మల్లికార్జున్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, మాజీ జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు యం. లావణ్య రెడ్డి తదితరులు ఉన్నారు.

**మెదక్ మున్సిపాల్టీలో బీఆర్ఎస్ అభ్యర్థులు వీరే:**

వార్డు నెంబర్ 1 చెప్యాల రాజవ్వ సంజీవ్, వార్డు 2 ఎరుకల ఎల్లయ్య, వార్డు 3 కొట్టాలా లలితా విశ్వం, వార్డు 4 ధర్మిశెట్టి స్వరూప, వార్డు 5 మామిళ్ళ ఆంజనేయులు, వార్డు 6 జీ. జీవన్ రావు, వార్డు 7 మాయ అనురాధ శ్రీనివాస్, వార్డు 8 మాయ గంగమణి మల్లేశం, వార్డు 9 ఎండి జుబేర్ అహ్మద్, వార్డు 10 వనం లత వెంకటేష్, వార్డు 11 కొండన్ సావిత్రి సురేందర్ గౌడ్, వార్డు 12 అనీస్ ఫాతిమా ఇమాడ్ అలీ, వార్డు 13 చెదల సంధ్య నవీన్ కుమార్, వార్డు 14 జక్కుల రమాదేవి లక్ష్మణ్, వార్డు 15 ఏ. గాయత్రి మల్లిఖార్జున్ గౌడ్, వార్డు 16 అవారీ రాజశేఖర్, వార్డు 17 బట్టి లలిత జగపతి, వార్డు 18 టేకి శంకర్, వార్డు 19 గొల్లబోయిన సునీల్, వార్డు 20 బొద్దుల నవీన్, వార్డు 21 ధర్మగల్ల సులోచన మహేష్, వార్డు 22 గౌస్ ఖురేషి, వార్డు 23 మాడబోయిన శ్రుతి సంతోష్, వార్డు 24 అంకం చంద్రకళ రవి, వార్డు 25 ఖాజా సోహెల్ మొహిద్దీన్, వార్డు 26 మ్యాధారి దీపక్, వార్డు 27 పల్లె రాణి బాల్ రాజ్, వార్డు 28 బండి పూజా నరేష్, వార్డు 29 బట్టి ఉదయ్, వార్డు 30 నింగమైల కిరణ్, వార్డు 31 ఆర్కె శ్రీను.

# ఈ ఏడాది చివరి నాటికి బీబీనగర్ ఎయిమ్స్ ప్రారంభం

## -ప్రధాని చేతుల మీదుగా ప్రారంభించేందుకు సన్నాహాలు

## -హైదరాబాద్-యాదగిరిగుట్ట వరకు ఎంఎంటీఎస్ పొడిగింపునకు కృషి

## - ఎయిమ్స్. పనుల పురోగతిపై కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి సమీక్ష




నల్గొండ, ఫిబ్రవరి 3: బీబీనగర్ మండల పరిధిలోని బీబీనగర్ ఎయిమ్స్‌ను కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎయిమ్స్ లో కొనసాగుతున్న నిర్మాణ పనుల పురోగతిని, అందుతున్న వైద్య సేవలను ఆయన పరిశీలించి మాట్లాడారు. తెలంగాణలోని అన్ని జిల్లాల ప్రజలకు సులభంగా, సమగ్ర వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో బీబీనగర్ వద్ద ఎయిమ్స్.ను నిర్మిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో అందించిన పాత భవనాలు ప్రమాణాలకు అనుగుణంగా లేకపోవడంతో వాటిని రీ-మోడలింగ్ చేసి, కొత్త డిజైన్ ప్రకారం పునర్నిర్మాణం చేపట్టామని వివరించారు. ఆసుపత్రి, మెడికల్ కాలేజీ, బాలుర-బాలికల హాస్టళ్లు, డైనింగ్ బ్లాక్స్.. తదితర అన్ని నిర్మాణాలు ఆధునిక ప్రమాణాలతో కొనసాగుతున్నాయని చెప్పారు.

ఇప్పటివరకు 86 శాతం పనులు పూర్తయ్యాయని, మొత్తం 201 ఎకరాల విస్తీర్ణంలో నిర్మాణం సాగుతుందన్నారు. నిర్మాణాల పూర్తి అనంతరం 750 పడకలతో పూర్తి స్థాయి వైద్య సేవలు ప్రారంభిస్తామని తెలిపారు. ఇప్పటివరకు రూ.832 కోట్లు ఖర్చు కాగా మొత్తం రూ.1,110 కోట్లు ప్రభుత్వం కేటాయించిందని పేర్కొన్నారు. ఎయిమ్స్ ప్రారంభమైనప్పటి నుండి 15 లక్షల మందికి పైగా ఓపీ సేవలు అందించగా, ప్రస్తుతం రోజుకు సగటున 1,800 మంది ఓపీ రోగులు చికిత్స పొందుతున్నారని తెలిపారు. డయాలసిస్, ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ సేవలు కొనసాగుతున్నాయన్నారు. ఎంబీబీఎస్, బీఎస్సీ, ఎంఎస్సీ, నర్సింగ్ కోర్సులు నడుస్తుండగా, 880 మంది విద్యార్థులు చదువుతున్నారని వెల్లడించారు. ఇప్పటికే రెండు బ్యాచ్‌ల ఎంబీబీఎస్ విద్యార్థులు పట్టాలు పొందారని తెలిపారు. బీబీనగర్ ఎయిమ్స్ ట్రిపుల్ ఆర్ ఔటర్ రింగ్ రోడ్డు మధ్యలో, జాతీయ రహదారికి సమీపంలో ఉండటంతో నల్లగొండ, వరంగల్, కరీంనగర్, హైదరాబాద్ జిల్లాల ప్రజలకు ఉత్తమ కనెక్టివిటీ ఉందన్నారు.

భవిష్యత్‌లో రీజినల్ రింగ్ రోడ్ పూర్తయితే మరింత మెరుగైన అనుసంధానం లభిస్తుందన్నారు. రోగుల అటెండెంట్లకు వసతి సదుపాయాల కోసం ప్రైవేట్ సంస్థలతో భాగస్వామ్యంపై ఆలోచన జరుగుతోందన్నారు.

రైల్వే సౌకర్యాల పరంగా బీబీనగర్ స్టేషన్‌లో మరిన్ని రైళ్లు ఆపేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయని, హైదరాబాద్-యాదగిరిగుట్ట వరకు ఎంఎంటీఎస్ రెండో దశ ప్రారంభించి రవాణా సౌకర్యం మరింత మెరుగుపర్చేందుకు చర్యలు చేపడతామన్నారు. 2026 చివరి నాటికి బీబీనగర్ ఎయిమ్స్?ను ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభించాలనే లక్ష్యంతో పనులు వేగవంతం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎయిమ్స్ డైరెక్టర్ అమితా అగర్వాల్, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, బిజెపి నాయకులు బోయపల్లి గోపాల్‌రెడ్డి, గూడూరు నారాయణరెడ్డి, అంబటి తరుణ్‌రెడ్డి, ఇంజమూరి ప్రభాకర్, కాసుల శ్రీకాంత్‌గౌడ్, కొలను లక్ష్మారెడ్డి, పొట్ట నవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

# రీ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం : ఆర్డీఓ శ్రీనివాసులు

నల్గొండ, ఫిబ్రవరి 3: రీ సర్వేతో రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆర్డీఓ శ్రీనివాసులు అన్నారు. ఆర్ ఓ ఆర్ యాక్ట్ (భూ భారతి)2024 ప్రకారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూముల రీ-సర్వే పైలట్ ప్రాజెక్టులో భాగంగా గరిడేపల్లి మండలంలోని గానుగబండ గ్రామంలో మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఆయన ముఖ్య అతిగా హాజరై మాట్లాడారు. రీ?సర్వేతో భూ రికార్డుల శుద్ధి జరిగి రైతులకు స్పష్టమైన హక్కులు కలుగుతాయన్నారు. రీ?సర్వే ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా, దశల వారీగా అమలు చేస్తామని వెల్లడించారు.


ముందుగా గ్రామ సరిహద్దులు నిర్ణయించి అనంతరం ప్రభుత్వ భూముల సర్వే, ఆ తర్వాత రైతుల పట్టా భూముల సర్వే చేపడతామని వివరించారు. రైతులు సహకరించి రీ సర్వేను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గానుగుబండ సర్పంచ్ కడియాల పద్మ అప్పయ్య, కొండయ్యగూడెం సర్పంచ్ కందుల మంగమ్మ కోటిరెడ్డి, సర్వే డివిజనల్ ఇన్‌స్పెక్టర్ వంశీ, తాసీల్దార్ స్రవంతి, మండల సర్వేయర్ భాస్కర్, మండల గిర్దావర్ ప్రవీణ్, రాంబాబు, కృష్ణవేణి, గ్రామ పాలన అధికా రులు, రెవెన్యూ అధికారులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


# మునిమాణిక్యం అద్భుత సృష్టి “కాంతం”

### దాంపత్య జీవిత రహస్యాలు... మునిమాణిక్యం పాత్రలు

**(ఫిబ్రవరి 4... మునిమాణిక్యం నరసింహారావు వర్ధంతి..)**

”కాంతం” పేరు వినగానే మనకు గుర్తుకు వచ్చేది మునిమాణిక్యం నరసింహారావు. కాంతం కథల ద్వారాఅయన తెలుగు పాఠకులకు సుపరిచితులు. తెలుగు సాహిత్యంలో ఒక “కాంతం” అన్న పాత్రను సృష్టించి ఆ పేరున ఎన్నో రచనలు చేశారు. కాంతం కథల’తో తెలుగువాళ్ల మనసుల్లో చిరునవ్వులు పూయించి, మధ్య తరగతి జీవితాల్లో భార్యాభర్తల అనుబంధాన్ని కళ్లకు కట్టిన రచయిత మునిమాణిక్యం






నరసింహారావు. ఆకాశవాణి హైదరాబాదు కేంద్రంలో విద్యా ప్రసారాలు అసిస్టెంట్ ప్రొడ్యూసర్ గా పని చేశారు. అంధ్ర సార స్వత పరిషత్, తెలుగు పండిత శిక్షణ పాఠశాల హెడ్మాష్టర్ గా హైదరాబాదులో 5 ఏళ్ళు పని చేశారు.

హాస్యరచయితలలో మునిమాణిక్యం గారికి ఒక విశిష్టస్థానం ఉంది. మునిమాణిక్యం కేవలం హాస్యరచయిత మాత్రమే కాదు. మంచి హాస్యోపాసకులు కూడా. విభిన్న వ్యక్తుల మనసులను అలరించే హాస్యోక్తులు హాస్య సన్నివేశాలు ఎక్కడ ఆయన దృష్టికి తెచ్చినా వాటిమీద మక్కువతో అనువదించి గాని, అనుసరించిగాని, భాషను కొంచెం తమాషాగా, మార్చి తెలుగు పాఠకులకు అందజేసే వారు.

మునిమాణిక్యం నరసింహారావు ఇరవైయ్యవ శతాబ్దం మొదటి పాదంలో ఒక కథకుడిగా రూపుదిద్దు కున్నారు. ముఖ్యంగా నోరి నరసింహశాస్త్రి, జరుక్ శాస్త్రులు వీరిని కథలు రాయమని ప్రోత్సహించారు. తను రోజు చెప్పే కబుర్లనే కథలుగా రాయమని తల్లావఝు&ఝల శివశంకరశాస్త్రి అనడంతో కథా రచనకు పూనుకున్నట్లు నరసింహారావే చెప్పుకున్నారు. కుటుంబ జీవితం లోని కష్టసుఖాలు, దాంపత్య జీవితం లోని సౌందర్యం ఈయన కథలలో ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. ఆయన సృష్టించిన కాంతం తెలుగు సాహిత్యం లోనే పెద్ద పీట వేసుకుని కూర్చుంది. మరీ ముఖ్యంగా దంపతుల నడుమ జరిగే సున్నితమైన హాస్య శృంగార ఘట్టాలను అందించడంలో ఆయన అందె వేసిన చేయి.ముని మాణిక్యం నరసింహారావు తెనాలి తాలూకా, సంగం జాగర్లమూడిలో మార్చి 15, 1898 న జన్మించారు. ఆయన తల్లిదండ్రులు వెంకాయమ్మ, సూర్యనారాయణ. ఆయన తెనాలిలో ఇంటర్మీడియెట్ చదివారు. డిగ్రీ చదవడానికి తాహతు లేకపోతే కొండా వెంకటప్పయ్య సహాయం వల్ల బి.ఎ చదివారు. ఆ తర్వాత గుంటూరు, భీమవరం, బందరు, కళాశాల్లో 30 ఏళ్ళు పని చేశారు. ఆదర్శ ఉపాధ్యాయులుగా పేరు తెచ్చుకొన్నారు.

ఆయన భార్య కాంతం. ఆయనకు ఇద్దరు మగపిల్లలు. ముగ్గురు ఆడపిల్లలు. ఆంధ్ర సారస్వత పరిషత్తులో ఉపాధ్యాయుడిగా, ఆకాశ వాణిలో పని చేశారు. ఆయన రాసిన మొదటి నవల ‘టీకప్పులో తుఫాను’. ఇందులోనే మొట్ట మొదటిగా కాంతం పాత్ర కనపడుతుంది. కాంతం కుటుంబం పేద కుటుంబం. కాంతం కథలలో ఒకటి ఆయన రేడియో నాటకంగా రాస్తే ఆయన కుమార్తె కాంతంగా వేసి అందరినీ మెప్పించింది.

ఆయన “కాంతం కథల” కి ఆయన భార్యే ప్రేరణ, స్ఫూర్తి. నిజ జీవితంలోనే దాంపత్య సన్నివేశాలను, చిన్న సంఘటనలను ఆధారంగా చేసుకుని రాసినవి కాబట్టే ఇప్పటికీ కాంతం కథలు నిత్య నూతన మనిపిస్తాయి. మన హాస్యం పేరుతో ఆయన చక్కని గ్రంథం వెలువరించారు. వక్రరేఖ తిరుమాళిగ, దీక్షితులు కాంతం, నేను–మా కాంతం (1933), కాంతం కైఫీయత్, కాంతం కాపురం, మునిమాణిక్యం కథలు, రుక్కుత ల్లి- శరద్రాత్రులు, అన్నయ మంత్రి, మరపు, స్తుతి - ఆత్మస్తుతి, ఇల్లు - ఇల్లాలు, మంచివాళ్ళ మాట తీరులు, గాజుల పెట్టి, తల్లి ప్రేమ

అయన రచనలలో ప్రసిద్ధం. తిరుమాళిగ, దక్కుతల్లి , దీక్షితులు నవలికలు - కరుణరస భరితాలు. పిల్లలకు, విద్యార్థులకు సరిపడేలా అన్నయ మంత్రి, వక్రరేఖ నవలలను రచించారు. తిరుగుబాటు అనే నాటకం వ్రాశారు. మునిమా ణిక్యం మొత్తంగా అరవై కథలు రాసినట్లు తెలుస్తుంది. ఇంటావిడతో పోట్లాట, ప్రణయ కలహం, భార్యను లొంగదీసు కోవడం ఎలా - వంటి రచనలు హాస్యస్ఫో రకాలు, మధ్యతరగతి సంసారాల దాంపత్య జీవిత రహస్యాలను ఆయన సజీవ పాత్రలుగా సృష్టించారు. తెలుగు సాహిత్యాన్ని తమ సునిశిత హాస్యం తో సుసంపన్నం చేసిన మునిమాణిక్యం ఫిబ్రవరి 4, 1973న మరణించారు.



-రామ కిష్టయ్య సంగన భట్ల,
9440595494

# కేసీఆర్ పాలనలో సుమారు 300కోట్ల అభివృద్ధి

### -రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలను ఓటు అడిగే హక్కు మా పార్టీదే

### -నియోజకవర్గ ఇంచార్జి చల్మెడ లక్ష్మీనరసింహరావు



రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 3 నేటినిజం (ప్రతినిధి): కసీఆర్ పాలనలో వేములవాడ మున్సిపల్ పరిధిలో సుమారు 300కోట్ల అభివృద్ధి జరిగిందని, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలను ఓటు అడిగే హక్కు మా పార్టీకే ఉందని వేములవాడ నియోజకవర్గ ఇంచార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు అన్నారు. మంగళవారం ప్రెస్ మీట్ లో ఆయన మాట్లాడుతూ కెసిఆర్ పాలనలో వేములవాడ పట్టణం లో సుమారు 30కోట్ల రూపాయలతో 35ఎకరాలు భూసేకరణ చేసి 90కోట్ల రూపా యలతో గుడిచెరువు సుందరీ కరణ చేసి గ్రీనరి కోసం చేయడం జరిగింద న్నారు.

అంతే గాకుండా వేముల వాడ పట్టణం లో విపరీత మైన తాగునీటి కొరత ఉండడ ంతో బి ఆర్ఎస్ రాష్ట్రం ఏర్పడ్డాక 47కోట్ల రూపాయలతో మిషన్ భగీరథ పథకం ద్వారా ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల నిర్మాణంలో ఇంటిం టికి 9వేల నల్లా కనెక్షన్‌లు ఇచ్చిన ఘన త కేసీఆర్‌దే.. అని గుర్తు చేశారు.

# కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలి

### -ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

### -26 వార్డులో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన విప్

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 3 నేటినిజం (ప్రతినిధి): మున్సిపల్ ఎన్నికల్లో మీ అమూల్యమైన ఓటు కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుపై వేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం



వేములవాడ మున్సిపల్ పరిధిలోని 26 వార్డులో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఈ నెల 11 న జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి కి మద్దతుగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాల న్నారు.రాష్ట్రం లో కాంగ్రెస్ పార్టీ అధికారం లో ఉంది, వేములవాడ లో నేను ఎమ్మెల్యే గా ఉన్నాను పట్టణంలో, రాజన్న ఆలయం అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని,అభివృద్ధి కావాలంటే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించా లన్నారు .గతంలో బీజేపీ,బీఆర్ ఎస్ పార్టీలకు అవకాశం ఇచ్చారని ,గతంలో వారికి అవకాశం ఇస్తే వేములవాడ పట్టణ అభివృద్ధిని విస్మరించరని,ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత చేసిన అభివృద్ధి పనులను బేరీజు వేసుకో వాలన్నారు. .రాజన్న ఆలయాన్ని 4 ఎకరాల విస్తరణలో అభివృద్ధి చేస్తున్నా మని,ఒక కన్ను రాజన్న ఆలయం ఇంకో కన్ను పట్టణ అభివృద్ధిగా ముందుకు పోతున్నమని వెయ్యి సంవత్సరాల పాటు ఉండేలా రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నాం అన్నారు..50 ఏళ్ల రాజన్న భక్తులు,పట్టణ ప్రజలు ఎదురు చూస్తున్న రోడ్డు వెడల్పు పనులు శరవేగంగా సాగుతున్నాయని,ప్రజలు కోరుకొనే విధంగా అభివృద్ధి చేస్తున్నాం అన్నారు.పట్టణ ప్రజలు మీకు విజ్ఞప్తి చేస్తున్నాను, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించండి, మీ వార్డు అభివృద్ధి చేసే బాధ్యత నాదన్నారు.ము న్సిపల్ ఎన్నికల్లో మీ అమూల్యమైన ఓటు కాంగ్రెస్ పార్టీ కి వేయాలని రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ఉన్నారు వేములవాడ ఎమ్మెల్యే గా నేను మీకు అండగా ఉన్న ,నాకు చెయ్యి తిరిగే విధా నంగా అధికార పార్టీ అభ్యర్థు లను గెలిపించలని పిలుపునిచ్చారు.

# పులి సంచార ప్రదేశాల్లో ప్రత్యేక చర్యలు

### - కలెక్టర్ హనుమంతరావు

నల్గొండ, ఫిబ్రవరి 3:యాదాద్రి భువనగిరి జిల్లాలోని పలు ప్రాంతాల్లో పులి సంచరిస్తున్నట్లుగా అటవీ శాఖ అధికారులు గుర్తించిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు



అన్నారు. మంగళవారం రాజాపేట మండలం బసంతాపూర్ గ్రామంలో సోమవారం రాత్రి పులి దాడిలో మృతి చెందిన లేగ దూడ సంఘటన స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇటీవల గ్రామాలలో పులి సంచరిస్తున్నందున పులిని పట్టుకోవడానికి చేసే ప్రయత్నాలపై అటవీ అధికారులతో కలెక్టర్ చర్చించారు. అటవీ అధికారులు పులిని పట్టుకోవడానికి థర్మల్ డ్రోన్‌ను ఉపయోగించి పులి సంచరిస్తున్న ప్రదేశాలను వీడియో తీయడం, ట్రాప్ కెమెరా, పులిని బంధించ డానికి బోన్లు ఏర్పాటు చేయడం జరిగిందని అటవీ శాఖ అధికారులు కలెక్టర్ కు వివరించారు. ప్రత్యేకంగా అడవి ప్రాంతాలకు ఆనుకుని ఉన్న గ్రామాల ప్రజలు రాత్రి వేళల్లో ఒంటరిగా బయటకు వెళ్లకూడదని, వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లేటప్పుడు గుంపులుగా వెళ్లాలని తెలిపారు.

రాత్రి వేళలో పశువులను బయటికి వదలకుండా పశువుల పాకలో వెలుతురు ఉండేలా చూసుకోవాలన్నారు. పులి కనిపించినట్లు గమనించిన వెంటనే అటవీ శాఖ అధికారులకు లేదా పోలీసులకు వెంటనే సమాచారం అందించాలన్నారు. వాటి దగ్గరకు వెళ్లే ప్రయత్నం చేయరాదన్నారు. జిల్లా యంత్రాంగం, అటవీ శాఖ సిబ్బంది పులి అడుగు జాడలను గమనిస్తూ, దాన్ని పట్టుకోవడానికి, అడవిలోకి పంపడానికి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలు భయాందోళనకు గురి కాకుండా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. ఆయన వెంట డీఎఫ్ఓలు సుధాకర్ రెడ్డి, పద్మజ, రాజాపేట బీట్ అధికారి నిఖిత ఉన్నారు.

# ‘మిషన్ పదో తరగతి’ పోస్టర్ ఆవిష్కరణ

నల్గొండ, ఫిబ్రవరి 3:ప్రభుత్వ పాఠశాలల 10వ తరగతి విద్యార్థులను ప్రోత్సహించే ఉద్దేశ్యంతో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ చేపట్టిన ‘మిషన్ 10వ తరగతి’ పోస్టర్ ను మంగళవారం అర్వపల్లి జడ్పీహెచ్ఎస్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సూర్యాపేట బ్రాంచ్ మేనేజర్ బందెల భరత్ కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించేందుకు శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ చేపట్టిన మిషన్ 10వ తరగతి కార్యక్రమం అభినందనీయమన్నారు. చదువుతోనే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని, ప్రతిభావంతులైన విద్యార్థులకు ఇటువంటి కార్యక్రమాలు గొప్ప ప్రోత్సాహానిస్తాయని తెలిపారు.

ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం రూ.2.2 కోట్ల నగదు బహుమతులను విద్యార్థులకు అందజేయనున్నట్లు వెల్లడించారు. మొదటి స్థానాన్ని పొందిన విద్యార్థికి రూ.5 లక్షలు, రెండవ స్థానం రూ.3 లక్షలు, ప్రతి జిల్లా టాపర్‌కు రూ.2 లక్షలు, అలాగే 119 అసెంబ్లీ స్థానాలకు ప్రతి నియోజకవర్గ టాపర్ కు రూ.1 లక్ష చొప్పున, అలాగే 612 మండలాల్లో టాపర్లకు రూ.10 వేల చొప్పున నగదు బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో సూర్యాపేట డెవలప్‌మెంట్ ఆఫీసర్ కుంభం సురేందర్, విజిట్ మేనేజర్ యుగంధర్, సెల్స్ ఆఫీసర్ శ్రీనివాన్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రధానమంత్రితో సంభాషించే అవకాశాన్ని అందుకోనున్న విజేతలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3:‘మై భారత్ బడ్జెట్ క్వెస్ట్ - 2026’ను కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ మన్‌సుఖ్ మాండవీయ ఈ రోజు ప్రారంభించారు. కేంద్ర బడ్జెటుపై దేశ యువతీయువకుల్లో అవగాహనను పెంపొందించడంతో పాటు, బడ్జెటులో చేసిన కేటాయింపుల్ని మరింత ఎక్కువ మంది అర్థం చేసుకోవడం కోసం దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. కళాశాలలు, సంస్థలు, శిక్షణ కేంద్రాల్లోని యువతను నిర్దిష్ట ప్రాతినిధ్య ప్రణాళిక ద్వారా భాగస్తుల్ని చేసి, పౌరులు తమ నిత్య జీవితంలో 2026 కేంద్ర బడ్జెటుకు ఉన్న ప్రాధాన్యాన్ని గ్రహించేలా చూడాలనేదే ఈ కార్యక్రమం ఉద్దేశం.

ఈ పోటీ రేపటి నుంచి.. అంటే 2026 ఫిబ్రవరి 3 నుంచి.. మై భారత్ వేదిక లో మొదలవుతుందని కేంద్ర మంత్రి తెలిపారు. ఇది 2026 కేంద్ర బడ్జెటుకు సంబంధించిన జాతీయ స్థాయి ఆన్‌లైన్ క్విజ్. మై భారత్ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకున్న యువతీయువకులు దీనిలో పాల్గొనవచ్చు. ఈ క్విజ్‌లో పాల్గొనడానికి ఫిబ్రవరి 17 ఆఖరి గడువుతేదీ. దీని తరువాత, ప్రతి ఒక్క రాష్ట్రంలో, కేంద్రపాలిత ప్రాంతంలో అగ్రగాములుగా నిలిచిన వారిని ఎంపిక చేస్తారు. వారు ఫిబ్రవరి 17 నుంచి 2026 మార్చి 3 వరకు రెండో విడత పోటీలో పాల్గొంటారు. ఈ విడతలో వ్యాసరచన పోటీని నిర్వహిస్తారు. వికసిత్ భారత్ దృష్టికోణానికి అనుగుణంగా కేంద్ర బడ్జెటులోని 8 అంశాలను దీనిలో భాగంగా యువతకు సూచిస్తారు. పోటీలో పాల్గొనేవారు తమ అభిప్రాయాల్నీ

ఆలోచనల్నీ వ్యాసాల రూపంలో తెలియజేస్తారు.

“వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ (వీబీవైఎల్‌డీ)లో యువజనులు వ్యక్తం చేసిన కొత్త కొత్త ఆలోచనల్ని గౌరవ ఆర్థిక మంత్రి ఈ సంవత్సర బడ్జెటు ప్రసంగంలో అభినందించడంతో పాటు, వాటిలో నుంచి కొన్ని ఆలోచనల్ని 2026-27 కేంద్ర బడ్జెటులో ప్రస్తావించారు” అని కేంద్ర మంత్రి డాక్టర్ మన్‌సుఖ్ మాండవీయ అన్నారు. ‘మై భారత్ బడ్జెట్ క్వెస్ట్‌ను నిర్వహించి ఈ భావనను ముందుకు తీసుకుపోయి, యువ వాణికి మరింత సాధికారితను అందించాలని మేం కోరుకుంటున్నాం’ అని కూడా ఆయన వివరించారు.

వ్యాసాల మూల్యాంకనాన్ని 2026 మార్చి 3 మొదలు అదే నెల 10 మధ్య చేపడుతారు. రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల వారీ ప్రతిభావంతుల జాబితాల్ని 2026 మార్చి 10న ప్రకటిస్తారు. రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల విజేతలు ఆ తరువాత వికసిత్ భారత్ దార్శనికత అంశంపై ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీతో వర్చువల్ మాధ్యమం ద్వారా ఏర్పాటు చేసే ఒక సంభాషణ కార్యక్రమంలో పాలుపంచుకొంటారు. జాతీయ ఆర్థిక పరిణామాలు, అభివృద్ధి ప్రాధాన్యాలకు సంబంధించిన విషయాలపై యువతలో అవగాహననీ, యువత ప్రాతినిధ్యాన్నీ పెంచడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ కార్యక్రమ నిర్వహణ పునరుద్ఘాటిస్తున్నది.

# కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం



రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 3 నేటినిజం (ప్రతినిధి): వేములవాడ మున్సిపాలిటీ 8 వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి సాగరం వెంకట్ స్వామి తనయుడు సాగరం సాగరం త్రినాథ్ నేతృత్వంలో కాంగ్రెస్ నేతలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు తీసుకెళ్తున్నామని, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాన్ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి చేతి గుర్తుపై ఓటు వేసి వార్డు 8 కాంగ్రెస్ అభ్యర్థి సాగరం వెంకటస్వామి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు దూలం భూమేష్, అక్రమ్, షాహిద్, శంకర్, రాజు, చింతల్ ఠానం రాజు, సాగరం బాబు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ప్రభుత్వం తోనే వేములవాడ మున్సిపాలిటీ అభివృద్ధి

### -10వ వార్డ్ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ సిరిగిరి సంగీత శ్రీకాంత్




రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 3 నేటినిజం (ప్రతినిధి): ప్రజా ప్రభుత్వంతోనే వేములవాడ మున్సిపల్ అభివృద్ధి జరుగుతోందని , 10 వ వార్డు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి సిరిగిరి సంగీత శ్రీకాంత్ అన్నారు. మంగళవారం వేములవాడ పట్టణ కేంద్రంలోని 10వ వార్డులో సుమారు 200 మంది మహిళలతో కలిసి భారీ ర్యాలీని నిర్వహించి,ఇంటింటా ప్రచారం నిర్వహించారు. చేతి గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ సర్కార్ అమలు చేస్తున్న మహిళలకు ఉచిత బస్సు, 2 యూనిట్ల లోపు ఉచిత కరెంటు, రూ.500 కే గ్యాస్ సిలిండర్, సన్న బియ్యం, స్వయం సహాయక గ్రూపులకు వడ్డీ లేని రుణాలు, ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ వంటి పలు సంక్షేమ కార్యక్రమాలను చూసి ఆదరించాలని కోరారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సహకారంతో రాజన్న టెంపుల్, వేములవాడ పట్టణ అభివృద్ధి, వేగవంతంగా అభివృద్ధి జరుగుతుందని, వేములవాడ మున్సిపాలిటీ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు.ప్రస్తుతం జరగబోవు మున్సిపల్ ఎన్నికల్లో చేతి గుర్తు పైన ఓటు వేసి తనను కౌన్సిలర్ గా భారీ మెజార్టీతో గెలిపించాలని 10వ వార్డు ప్రజలను విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, యూత్ నాయకులు, భారీ ఎత్తున వార్డు మహిళలు పాల్గొన్నారు .

# మహిళా వైద్యుల సేవలకు ఘన గౌరవం

నల్గొండ, ఫిబ్రవరి 3:గ్రామీణ ప్రజారోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న మహిళా వైద్యులు, ఆశా వర్కర్ల సేవలకు బీబీనగర్‌లో ఘన గౌరవం లభించింది. జాతీయ మహిళా వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బీబీనగర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డా.మౌనికతో పాటు మహిళా వైద్యులు, ఆశా వర్కర్లను మాజీ సర్పంచ్ మల్లగారి భాగ్యలక్ష్మి శ్రీనివాస్ మంగళ వారం ఘనంగా సన్మానించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహిళా వైద్యులు, ఆశా వర్కర్లు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడంలో అహర్నిశలు శ్రమిస్తున్నారని కొనియాడారు.

కష్ట సమయాల్లోనూ వెనకాడకుండా ప్రజలకు సేవలం దించడం అభినందనీయమన్నారు. ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా పనిచేస్తున్న వీరి సేవలు సమాజానికి ఆదర్శమని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పిట్టల అశోక్, అమృతం శివకుమార్, పంజాల సురేష్ గౌడ్, దేవరుప్పల పృథ్వీ, టంటం భార్గవ్, గుంటిపల్లి లక్ష్మీనారాయణ, బెండె ప్రవీణ్, దేవరకొండ శ్రీనివాస్, మరి వెంకటేష్, కృష్ణ, గణేష్ పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**

RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com